ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 18.0

నేడో రేపో బదిలీలు



సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ అటు రాజకీయ పక్షాలు, ఇటు అధికార యంత్రాంగంలో మార్పులు, చేర్పులతో భారీ హడావుడి. ప్రత్యేకించి ఎన్నికల నిర్వహణకు వీలుగా అధికార యంత్రాంగాన్ని ఎన్నికల కమిషన్ అప్రమత్తం చేసింది. ఇప్పటికే ఓటర్ల జాబితా కూడా వెలువడింది. ఇక తదుపరి చర్యల్లో భాగంగా ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులు ఒకేచోట మూడేళ్లు పనిచేస్తుంటే వారిని తక్షణం వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని ఆదేశాలు. ఇప్పటికే పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయింది. కీలక విభాగాలైన కొన్నింటిలో మాత్రం ఈనెల 25లోపే ఈ తతంగాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే ఎవరెవరు, ఎక్కడెక్కడ అనే దానిపై జిల్లా యంత్రాంగం ఒక స్పష్టతతో ఉన్నందున నేడో, రేపో కీలక ఉత్తర్వులు వెలువడతాయి. ఒక విశేషం ఏమిటంటే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రామాణికంగానే బదిలీలు ఉంటాయి.

- (ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి పశ్చిమ జిల్లానే ప్రాతిపదికగా ట్రాన్స్‌ఫర్లు



- ఆ దిశగానే ప్రత్యేక కసరత్తు
- డజన్ల సంఖ్యలోనే బదిలీలు
- పోలీసు శాఖలో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి
- ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఎన్నికల విధులతో సంబంధం ఉండే అధికారుల బదిలీ తప్పనిసరి. సాధ్యమైనంత మేర ఈ రెండు, మూడు రోజుల్లోనే ఈ బదిలీ ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇప్పటికే పోలీసుశాఖలో ఈ తాజా నిబంధనలకు అనుగుణంగానే గడిచిన పక్షం రోజులుగా బదిలీ ప్రక్రియ కొనసాగించారు. రేంజ్ పరిధిలో ఉన్న వారందరినీ గమనించి ఆ మేరకు ఎస్ఐల దగ్గర నుంచి సీఐల వరకు స్థానచలనం చేశారు. ఇప్పటికే వీరంతా తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు. ప్రత్యేకించి పోలీసు విభాగంలో ఎన్నికల వేళ ప్రతీసారి ముందస్తుగానే బదిలీలు ఉంటాయి. అందుకనే ఇప్పటికే టికెట్ ఖాయమైన కొందరు అధికార పక్ష సిట్టింగులైతే సాధ్యమైనంత మేర తమకు అనుకూలురు నియోజకవర్గంలో పోస్టింగ్ వచ్చేలా జాగ్రత్తపడే అవకాశాలున్నాయి. దీనిని అవకాశంగా తీసుకుని ఒత్తిడి చేసి ఒకవేళ పోస్టింగ్ తీసుకున్నా వారిపై ఎలాంటి ఆరోపణలు వచ్చినా తక్షణం ఎన్నికల కమిషన్ రియాక్షన్ ఉంటుంది. అయినప్పటికీ ఎంత వీలైతే అంత తమకు అనుకూలురు వచ్చేలా పావులు కదుపుతూనే ఉన్నారు. ప్రత్యేకించి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మాత్రమే బదిలీలు జరుగుతాయి కాబట్టి.. తాజాగా కొత్త జిల్లాలకు ఈ మధ్యనే బదిలీ అయినా అటువంటి వారికి కూడా ఒకే ప్రాంతంలో మూడేళ్ల విధుల షరతు వర్తిస్తుంది. ప్రత్యేకించి ఈ లెక్కన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, జిల్లాస్థాయి అధికారులు డజన్ల సంఖ్యలో బదిలీ కావడానికి ఆస్కారం. ఉమ్మడి పశ్చిమలో దాదాపు సగానికి సగం మంది తహసీల్దార్లపైన బదిలీ ప్రభావం పడుతుంది. ఎందుకనంటే అత్యధికంగా మూడేళ్ళపాటు ఉమ్మడి జిల్లాలో పనిచేసినవారే ఎక్కువ. ఈ తరుణంలో వీరందరినీ స్థానచలనం చేస్తారు. ఎంపీడీవోల్లో కొంతమందిని ఈ మధ్యన బదిలీ చేశారు. కొందరికేమో ప్రమోషన్ ఆధారంగా బదిలీలు అయ్యాయి. ఎన్నికల విధుల్లో వీరిలో చాలామంది కొనసాగే అవకాశం ఉన్నందున బదిలీ కాబడే జాబితాలో ఎంపీడీవోల సంఖ్య అత్యధికంగానే ఉండే అవకాశాలున్నాయి. ప్రత్యేకించి కిందిస్థాయి సిబ్బంది బదిలీలేవీ పెద్దగా ఉండకపోవచ్చు.

ఎన్నికల ఏర్పాట్లు చకచకా..

రాబోయే ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే పెద్దఎత్తున చర్యలకు దిగుతున్నారు. ఎక్కడికక్కడ ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలించడానికి వీలుగా ప్రత్యేక ఎలక్షన్ సెల్ ఏర్పాటైంది. తమ అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈ సెల్‌కు నివేదించాల్సి ఉంది. మరోవైపు పోలింగ్ కేంద్రాల నిర్ధారణ దాదాపు పూర్తయింది. ఇప్పుడేమో ఆయా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాల మేర పూర్తిగా దృష్టిపెట్టారు. విద్యుత్ సరఫరా, తక్షణం ఉన్న సౌకర్యాలు, సమకూర్చాల్సిన సౌకర్యాలు, తాగునీరు, దివ్యాంగులను నేరుగా పోలింగ్ కేంద్రాలకు రావడానికి అనువుగా ర్యాంపుల నిర్మాణం వంటి చర్యలన్నింటిపైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తాజాగా సమీక్షించింది. ప్రత్యేకించి ఎక్కడా లోపాలు తలెత్తకుండా ముందస్తుగానే జాగ్రత్తపడుతున్నారు. త్వరలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు వీలుగా తీసుకుంటున్న చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష జరగనుంది.

జిల్లాస్థాయి అధికారులకు స్థానచలనమే..

జిల్లాస్థాయిలో ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు బదిలీ అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. జిల్లాలో చాలాకాలం నుంచి విధులు నిర్వహిస్తున్న వారంతా సీనియర్లు కావడం, వీరందరిని ఎన్నికల విధుల్లోకి తీసుకోవాల్సి ఉన్నందున ఇక బదిలీ తప్పకపోవచ్చు అంటున్నారు. ఈ లెక్కన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్, సివిల్ సప్లయి, డీఈవో, జిల్లా షైనార్టీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులను బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, సెట్‌వెల్, మెప్మా సంబంధిత శాఖాధిపతులు బదిలీ జాబితాలో చేరే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో, పశ్చిమగోదావరి జిల్లాలో ఈ శాఖల్లో విభాగాధిపతులుగా పనిచేస్తున్న కొందరు ఇప్పటికే మూడేళ్లకుపైగా సర్వీసు పూర్తి చేసుకున్నారు. ఎన్నికల నిబంధన ప్రకారం వీరందరినీ ఆయా ప్రాంతాల నుంచి విధిగా బదిలీ అవుతారు. ప్రత్యేకించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా పనిచేయబోయే వారందరినీ ఇప్పటికే దాదాపు గుర్తించారు. ఇకపోతే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు ఇంకొంత కాలం ఇదేస్థానాల్లో కొనసాగే అవకాశాలున్నాయి. ప్రస్తుత ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు.

వైఎస్‌ఆర్ ఆసరా నగదు జమ

- నాలుగో విడతగా రూ.362.59 కోట్లు విడుదల



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 23 : ఏలూరు జిల్లాలో 39,574 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని 3,89,801మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద రూ.362.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ బహిరంగ సభనుంచి మంగళవారం ఆసరా పథకం కింద నాలుగో విడత నిధులు నేరుగా స్వయం సహాయక పొదుపు సంఘాల ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారు.

- రాష్ట్రవ్యాప్తంగా రూ.7,98,395 సంఘాల్లోని 78,94,169 మందికి 6,394.83 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పలు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. అనంతరం 39,574 స్వయం మహిళాసంఘాలకు 362.59కోట్ల విలువగల మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్టాంపులు, చెక్కుల దహనం



చెక్కును దహనం చేస్తున్న ఖజానా శాఖ అధికారి కృష్ణ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 23 : ఏలూరు జిల్లా పరిధిలోని 8 ఉప ఖజానా కార్యాలయాలు, జిల్లా ఖజానా కార్యాల యాలకు సంబంధించి ఉపయోగంలో లేని 3,420 చెక్కు పుస్తకాలు, 16,12,985 రూపాయల విలువైన 60 రకాల స్టాంపులు, జిల్లా ఖజానా కార్యాలయం ఆవరణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు నేతృత్వంలో జిల్లా రిజిస్ట్రార్, డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి, పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో దహనం చేశామని జిల్లా ఖజానాశాఖ అధికారి పి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 135 ప్రకారం చాలాకాలంగా ఉపయోగంలో లేని పలు రకాల స్టాంప్‌లు, చెక్కులు దహనం చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఆ ఆదేశాల మేరకు జేసీ ఆధ్వర్యంలో పదిమంది జిల్లాస్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి వీటిని దహనం చేసినట్టు ఆయన తెలిపారు.

జల్ జీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి తాగునీరు

- డీపీవో శ్రీనివాస విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసవిశ్వనాథ్

ఏలూరుసిటీ, జనవరి 23: జిల్లాలో ప్రతి ఇంటికి జల్‌జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ ఆదేశాలతో హర్ ఘర్ జల్ సంబంధించి గ్రామ సభలు జరపని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో డీపీవో విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హర్ ఘర్ జల్ పథకంలో భాగంగా జిల్లాలో 4 లక్షల 80వేల ఇళ్లకు గాను, 4లక్షల 7వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. రూ. 455 కోట్లతో 1,784 పనులు మంజూరైతే 665 పనులు పూర్తయ్యాయని, 624 పనులు ప్రగతిలో ఉన్నాయని, 495 పనులు కమ్యూనిటీ ద్వారా చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జల్ జీవన్ మిషన్ అమలులో 85శాతం పనులు పూర్తి చేసి జిల్లా ప్రగతి పథంలో ఉందని, 273 గ్రామాలను లక్ష్యంగా పెట్టుకుని హర్‌ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటించాల్సి ఉంటే ఇప్పటికే 258 గ్రామాలు ప్రకటించామని మిగిలిన 17 గ్రామాలను ఈనెల 27 వతేదీ నాటికి డిక్లేర్ చేసి లక్ష్యం పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వాయిస్స్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, నవాజ్‌లు హాజరయ్యారు.

నరసాపురం ఇన్‌చార్జి తమ్మయ్య ?





- త్వరలోనే అధికార ఉత్తర్వులు
- ఇప్పటికే ముఖం చాటేసిన అనేక మంది..
- బీసీ మంత్రం ప్రయోగించేందుకు వ్యూహం

ఏలూరు ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ఆచంట, జనవరి 23: ఎంపీ స్థానాల్లో పోటీ చేసేందుకు అనువైన, అనుకూ లమైన అభ్యర్థుల కోసం వైసీపీ వెంపర్లాడుతోంది. ప్రత్యే కించి రాజకీయంగా హంగు, ఆర్థికంగా స్తోమత కలిగిన అభ్యర్థుల కోసం వెతుకులాడుతోంది. ఎవరూ దొరకని పక్షంలో ఏదొక కోణంలో ఒక అభ్యర్థిని రంగంలోకి దింపి సామాజికంగా మేమే ఆదరిస్తున్నామనే కలరింగ్ ఇస్తు న్నది. ఈ నేపథ్యంలోనే నరసాపురం ఎంపీ స్థానానికి ఇన్‌చార్జిగా మాజీ జడ్పీటీసీ గుబ్బల తమ్మయ్యను నియ మించాలని నిర్ణయానికి వచ్చారు. ఒక వైపు బీసీ మంత్రం పటించినట్లు అవుతుందని ఇంకో వైపు అభ్యర్థులు దొరకడం లేదనే వాతావరణానికి బ్రేక్ వేసినట్లు అవు తుందని జగన్ పార్టీ ద్విముఖ వ్యూహం. ఉమ్మడి పశ్చిమలో సాధ్యమైనంత మేర ఎంపీ స్థానాలకు తొలుత పార్టీలో ఆర్థిక బలం ఉన్న వారికి చోటు ఇవ్వాలని వైసీపీ భావించింది. ఏలూరు లోక్‌సభ స్థానంలో బలమైనవారి కోసం నెలలు తరబడి ముప్పు తిప్పలు పడింది. ఈ స్థానంలో సిట్టింగ్ ఎంపీగా ఉన్న కోటగిరి శ్రీధర్ తాను పోటీ చేయబోనని ఆరు నెలలు క్రితమే ప్రకటించడంతో ఆర్థికంగా,సామాజికంగా బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ జరిపింది. మాజీ మంత్రులను సంప్రదించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి కారుమూరి నాగేశ్వరరావును పోటీకి దిగాలంటూ తిణ్ణడి చేసింది. "నన్ను వదిలేయండి.. మా ఆ అబ్బాయికి అకాశం ఇవ్వాండని కారుమూరి చేసిన విజ్ఞప్తితో ఓ మెట్టు దిగి మంత్రి కోరికను నెరవేర్చారు. బీసీలు అంటే తమ పార్టీకి ప్రాణం అన్నట్లుగా అందుకే ఏలూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా బీసీ వర్గాలకు చెందిన సునీల్ కుమార్‌ను నియమించినట్లుగా కలరింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న తమ్మయ్యను నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించబోతున్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పేరు కూడా చాన్నాళ్ల పాటు వినిపిం చింది. పార్టీలో ఈ ప్రతిపాదన వచ్చిన వెంటనే రంగనాథరాజు తన వ్యతిరేకతను సంకేతాల రూపంలో అధిష్టానానికి పంపారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న రంగ రాజు అయితేనే అనుకూలంగా ఉంటుందని, సామాజిక పరంగా కూడా తగినంత మద్దతు కూడగట్టుకో గలుగుతామని వైసీపీ అంచనాకు వచ్చింది. దీనికి భిన్నంగా అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న గోకరాజు రంగరాజు (పెద బుజ్జి) పేరు ఇలాగే వినిపించింది.. క్రమేణ ఆయ నను జిల్లా సారధ్య పగ్గాల నుంచి తప్పించారు. దీంతో ఎంపీ స్థానాల్లో పోటీ చేసేది ఎవరనే అంశంపై మల్ల గుల్లాలు పడినపుడు మరో మారు మంత్రి కారుమూరి పేరు ప్రచారంలోకి వచ్చింది.

ఇపుడేమైందంటే..

ఎంపీ అభ్యర్థులు అన్వేషణలో ముప్పుతిప్పలు పడుతూ వచ్చిన వైసీపీ ఈ ప్రాంతంలో ఒక సామాజిక వర్గాన్ని తమ వైపు తిప్పుకునే క్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య పేరును పరిశీలనలో తీసు కుంది. దానికంటే ముందు ఉమ్మడి తూర్పులో ఇదే సామాజిక వర్గంలో కాస్తంత ఆర్థిక పరిపుష్టి కలిగిన నేత కోసం అన్వేషించింది. అక్కడ ఎవరూ సానుకూలంగా స్పందించకపోవడం అంతకంటే మించి ఇపుడున్న రాజకీయ పరిస్థితులు నేపథ్యంలో ఆర్థికభారం మోసేందుకు ఇష్టపడకపోవడంతో ఇక తమ్మయ్య వైపు మొగ్గు చూపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత పితాని సత్యనారాయణకు స్వయంగా బావ అయిన తమ్మయ్య టీడీపీ నుంచి తప్పుకుని వైసీపీలో చేరారు. అంతకు ముందు 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా నరసాపురం నుంచి పోటీ చేశారు. అప్పట్లో తమ్మయ్యకు అటు చిరంజీవి అభిమానులు, సామాజిక పరంగా కొంత మద్దతుతో లభించడంతో దాదాపు లక్షా 60 వేలకు పైగా ఓట్లు దక్కాయి. నరసాపురం నుంచి టీడీపీ, జనసేన తరుపున ఆర్థికంగా బలోపేతం అయిన అభ్యర్థి రంగంలోకి దిగుతుండడంతో కేవలం బీసీ బాణం చూపించి తమ్మయ్యను రంగంలోకి దింపబోతున్నారు. నరసాపురం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయడానికి సిద్ధం కండి అంటూ ఆయనకు మంగళవారం పార్టీ సంకేతాలు ఇచ్చింది. తక్షణం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బేటి కావాలని ఆ తదుపరి పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్‌ను కలిసేందుకు రావచ్చునని సూచించారు.ఆర్థికంగా బలహీనుడైనా పార్టీ పరంగా అన్నీ తామే చూసుకుంటామని ఇంకో సంకేతం ఇచ్చింది.

ప్రభుత్వ హైస్కూళ్లకు ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్‌ల నియామకం

- 69 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు 208 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్



ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23:విద్యారంగంలో గ్లోబల్ సవాళ్లను అధిగమించేక్ర మంలో బీటెక్, ఎంటెక్ ఇంజనీరింగ్ ఫైనలియర్ చదు వుతున్న 69మంది విద్యార్థులను 'ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్'గా హైస్కూళ్లలో ఇంటర్న్‌షిప్ నిమిత్తం కేటాయిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీచేసింది. పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రమంతటా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి తొలిదశలో ఏలూరు జిల్లాలోని 208 ప్రభుత్వ హైస్కూళ్లను ఎంపికచేసింది. ఒక్కో విద్యార్థికి మూడు చొప్పున ఉన్నత పాఠశాలలను కేటాయించారు. తొలివిడతగా ఏలూరు సమీపంలోని సీఆర్ఆర్, రామచంద్ర, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచిల విద్యార్థులను రీసోర్స్ పర్సన్లు(ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్)గా నియమించారు. వీరందరినీ తక్షణమే కేటా యించిన పాఠశాలల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వీరు 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగం, తరగతి గదుల్లో అమర్చి న స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ(ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్)ల నిర్వహణ, వాటితో బోధనా విధానంపై టీచర్లకు శిక్షణ, టోఫెల్ వంటి ఆంగ్లభాషా పరిజ్ఞాన పోటీ పరీక్షలకు విద్యా ర్థులను సన్నద్ధం చేయడం తదితర డిజిటల్ అంశాల్లో అటు టీచర్లకు, ఇటు విద్యార్థులకు సపోర్ట్ ఇస్తారు. వీరికి నెలకు రూ.12 వేలు గౌరవ వేతనంతోపాటు, సంబంధిత ఇంజనీరిం గ్ కళాశాలనుంచి కేటాయించిన హైస్కూలుకు రాకపోకల నిమిత్తం కిలోమీటరుకు రెండు రూపాయలు చొప్పున సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు నిధులనుంచి చెల్లిస్తారు. వీరి నియమకాలపై డీఈవో పి.శ్యాంసుందర్ వివరణ ఇస్తూ 'ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న 69మంది విద్యార్థులను జిల్లాకు కేటాయించారు. వీరిలో ఇంతవరకు 43మంది రిపోర్టు చేశారు. ఇంటర్న్‌షిప్ వ్యవధి పూర్తయ్యేవరకు వీరంతా తమకు కేటాయించిన హైస్కూళ్ళలో విధులు నిర్వర్తిస్తారు. భవిష్యత్తు సాంకేతికత, ఉద్యోగావకాశాలు తదితర విషయాల్లో టీచర్లు, విద్యార్థులకు గైడెన్స్ ఇస్తారు.' అని వివరించారు.

అంగన్‌వాడీల ఉద్యమ ఫలితం హామీలకే సరి..

- నిరాశగా విధుల్లో చేరిన వైనం



పోలవరం బెస్తావీధి అంగన్వాడీలో కుళ్లిన గుడ్లు, ఉబ్బిన పాల ప్యాకెట్లు

భీమవరం, జనవరి 23 : అంగన్‌వాడీ ఉద్యమం మహోద్యమంగా సాగింది.. అయినా ప్రభుత్వం మొండికేసింది. చివరికి ఆందోళన విరమించక తప్పలేదు. వారు సుదీర్ఘకాలంగా కోరుతున్న డిమాండ్లలో కీలకమైన రూ.18 వేల వేతనం మాత్రం వచ్చే జూలై తరువాత చెల్లిస్తామని హామీ అమలు చేస్తామని మాత్రమే ప్రభుత్వం ప్రకటించింది. సమ్మె కాలానికి కూడా వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అంగన్వాడీ ప్రతినిధుల డిమాండ్లపై కొన్ని డిమాండ్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు, నిర్వహణ చార్జీలు విడుదల చేశామని తెలిపింది. అంగన్వాడీ హెల్పర్‌లు, అంగన్వాడీ వర్కర్‌ల పదోన్నతి కల్పించేందుకు వయో పరిమితిని పెంపు, టీఏ, డీఏలు, గరిష్ట వయోపరిమితిని 62 ఏళ్లుగా పెంపు, సేవా ముగింపు ప్రయోజనం రూ.10 వేలు నుంచి రూ.40 వేలుకు పెంపు ఉత్తర్వులు జారీ, అద్దెలు, నీరు, విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైన వాటి కోసం నిధుల విడుదల, అంతేకాకుండా 2019 నుంచి అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500లకు, మినీ అంగన్వాడీ జీతాలను రూ.7వేలకు, అంగన్వాడీ హెల్పర్ల జీతాలను రూ.7వేలకు పెంపుదల, 2013 సంవత్సరం తరువాత తొలిసారిగా పదోన్నతులు కల్పించడం, సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షల వయోపరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచారు. కేవలం సంస్థాగత అంశాలకే ప్రభుత్వం ఆమోదం తెలిపిందే తప్ప, కీలకమైన వేతనం పెంపు విషయం మాత్రం పెండింగులో పెట్టారు. చివరికి ఏలూరు జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, టీచర్లు మొత్తం 2300 మంది మంగళవారం విధుల్లో చేరారు.

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీలు

- కుళ్లిన గుడ్లు, ఉబ్బిన పాల ప్యాకెట్లు

పోలవరం, జనవరి 23 : తమ సమస్యల పరిష్కారం కోసం 40 రోజులకుపైగా సమ్మెలు, దీక్షలు, నిరాహార దీక్షలు చేసి విరమణ తర్వాత విధుల్లో చేరిన అంగన్వాడీలకు మంగళవారం తమ సెంటర్లలో కుళ్లిన కోడిగుడ్లు, ఉబ్బిన పాల ప్యాకెట్లు దర్శనమి వ్వడంతో నివ్వెరపోయారు. గడిచిన 40 రోజుల్లో స్థానిక వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో అంగన్వాడీ సెంటర్లు ఓపెన్ చేయించిన అధికారులు గుడ్లు, పాల ప్యాకెట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయకపోడం వల్ల గుడ్లు కుళ్లిపోయాయి. పురుగులు పట్టి దుర్గంధం వెదజల్లాయి, పాల ప్యాకెట్లు ఉబ్బి రంగుమారాయి. అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్వాడీల తాళాలు బద్దలు కొట్టడం, అంగన్వాడీలు తమ సెంటర్‌లలో ఉన్నస్టాకు అప్పగించక పోవడం వల్ల అంగన్వాడీల్లో ఉన్న స్టాకు హెచ్చుతగ్గుల విషయంలో ఎవరు బాధ్యత వహిస్తారో అనే భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విషయంపై అధికారులకు ఫోన్లు చేయగా మీరు మాకు అప్పగించారా తాళాలు తీసి పనులు చేసుకోండని అధికారులు సమాధానమిస్తుండడంతో స్థానిక లబ్ధిదారుల సమక్షంలో సెంటర్ల తాళాలు తీసి ఫొటోలు తీసుకున్నారు. మండ లంలో 85 సెంటర్‌లలో ఇదే పరిస్థితి నెలకొందని అంగన్వాడీలు తెలిపారు.




నోరూరించేలా రంగులు కలిపి వండిన చికెన్, మటన్, ఫిష్ ఫ్రై

డేంజర్ ఫుడ్..!

- కృత్రిమ రంగుల పౌడర్‌తో ఆహార పదార్థాల తయారీ
- ప్రజల ఆరోగ్యంతో హోటల్ యజమానుల చలగాటం
- దాడులు జరిగినా యథేచ్ఛగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు.. అనారోగ్యంబారిన ప్రజలు?

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : నిబంధనలకు నీళ్లొదిలి ఆరోగ్యానికి హానికరమైన కృత్రిమ రంగుల పౌడర్‌తో ఆహార పదార్థాలు తయారు చేస్తుండడంతో భోజనప్రియులు బెంబేలెత్తుతున్నారు. నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో జిల్లాలో కొన్ని బడా హోటళ్లు, రెస్టారెంట్లలో యథేచ్ఛగా వండి వడ్డించేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 18న పట్టణంలోని ముబారక్ కచ్చీ బిర్యాని పాయింట్‌లో ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేశారు. డొమెస్టిక్ సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌లను వంటకాలకు వాడుతున్నట్టు గుర్తించి 23 గ్యాస్ బండలను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. మరుసటి రోజు, ఆహార పదార్థాల్లో కృత్రిమరంగుల పౌడర్‌లను వాడుతున్నారన్న సమాచారంతో తినేరా రెస్టారెంట్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు సంయుక్తంగా దాడి చేసి 15 రకాల కృత్రిమ రంగుల పౌడర్ డబ్బాలను గుర్తించి ధ్వంసం చేశారు. ఆహార పదార్థాల నమూనాలను ల్యాబ్‌కు పంపారు. చికెన్, మటన్, చేప, ఎగ్, రొయ్య, కౌజు పిట్టల వంటకాలపై రెస్టారెంట్, హోటల్ యజమానులు కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్నారు. వాటిలో భాగంగానే మాంసం ముద్దల రంగును మార్చేందుకు ఆరోగ్యానికి హానికరమైన ఎన్నో రసాయన పౌడర్‌లను వాడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో జిల్లాలో కొన్ని బడా హోటళ్లు, రెస్టారెంట్‌లలో నాణ్యత లేని, రసాయన పౌడర్‌లు కలిసిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయిస్తున్నారు. దీంతో అనారోగ్యంబారిన పడుతున్నారు.

హోటల్ లేదా రెస్టారెంట్‌ను నిర్వహించేందుకు షెడ్యూల్-4 ప్రకారం 21 నిబంధనలు ఉన్నాయి. ప్రధానంగా ఫుడ్ లైసెన్స్ ఉండాలి. దాని కాలపరిమితి ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించుకోవాలి. వంటశాల అత్యంత శుభ్రంగా ఉండాలి. దుర్వాసనలు రాకూడదు. డ్రెయినేజీ వ్యవస్థ ఉండాలి. కృత్రిమ రంగులను ఆహార పదార్థాల్లో వాడకూడదు. నలభీముల ఆరోగ్య పరిస్థితులపై సర్టిఫికెట్‌లు కలిగి ఉండాలి. కానీ నిబంధనలు తుంగలోతొక్కి హోటళ్లు రన్ చేస్తున్నారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులకు తెలిసిన వారు పట్టించుకోవడం లేదని బహిరంగంగానే ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ విధానాలు.. టీచర్ పోస్టుల భర్తీపై పెనుప్రభావం

- అరకొర నియామకాలతో నిరుద్యోగులకు ఎన్నికల గాలం


ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23: డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీల సంఖ్యపై ప్రాథమిక సమాచారం అందింది. అన్ని కేడర్లు, సబ్జెక్టుల్లో సుమారు 470 పోస్టులు ఉండవచ్చునని తెలిసింది. అయితే రిటైర్డ్ ఉపాధ్యాయుల పోస్టులు, ఉద్యోగ విరమణచేయనున్న టీచర్ల ఖాళీలను కూడా కొత్త డీఎస్సీలోనే చేర్చాలని ప్రభుత్వం నిర్ణయిస్తే పోస్టుల సంఖ్య పెరిగేందుకు అవకాశాలున్నాయి. ప్రాథమిక తరగతులను సమీప హైస్కూళ్లలోకి విలీనం, పలు తరగతులకు తెలుగుమాధ్యమ సెక్షన్ల ఎత్తివేత, వీటి ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా తగ్గిపోయిన విద్యార్థుల సంఖ్య, దీనికనుగుణంగానే టీచర్ల రేషనలైజేషన్, మిగులు టీచర్‌పోస్టులను ఇతర జిల్లాలకు తరలించడంతో ఉమ్మడిజిల్లాలో కొత్తగా ఉపాధ్యాయ నియామకాలపై పెనుప్రభావమే చూపిందని తెలిసింది. 30 శాతం ఉపాధ్యాయ ఖాళీలను ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీచేసేయడం వల్ల పోస్టుల సంఖ్యలో కోత పడటానికి ఓ కారణమని చెబుతున్నారు. పూర్వపు డీఎస్సీల్లో ఎంపికై వివిధ కారణాలవల్ల నియమితులుకాలేకపోయిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులను కనీస వేతన స్కేలు (ఎంటీఎస్)పై 430 ఎస్జీటీ పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించడంవల్ల ఆ మేరకు ఉద్యోగఖాళీలు తగ్గిపోయాయని విశ్లేషిస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టుల్లోనే కొత్త నియామకాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మిగతా సబ్జెక్టుల్లో రెండంకెల్లోనే నియామకాలుంటాయని సమాచారం. ఎంటీఎస్ టీచర్లను నియమించిన రెగ్యులర్ ఖాళీలను కూడా భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే ఆ మేరకు పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతోపాటు ఈ ఏడాది జనవరి నెలాఖరువరకు ఉద్యోగ విరమణ ద్వారా ఖాళీ అయ్యే పోస్టులను కొత్త డీఎస్సీలోనే చేర్చితే పోస్టుల సంఖ్య కొంతమేర పెరగడానికి ఛాన్స్ ఉంది. తొలుత 'టెట్' నిర్వహించిన తర్వాతే డీఎస్సీ రాతపరీక్షను జరుపుతామని గతంలో పలు సందర్భాల్లో ప్రభుత్వం చెప్పింది. తాజాగా జరుగుతున్న ప్రచారంలో టెట్ ప్రస్తావన లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకివచ్చిన నాలుగున్నరేళ్లలో డీఎస్సీని చేపట్టకుండా ఇపుడు అత్యవసరంగా ఉపాధ్యాయ నియామకాలను తెరపైకి తీసుకురావడం ఎన్నికల స్టంట్‌గా భావిస్తున్నారు. ఏపీ రెసిడెన్షియల్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లోని ఉపాధ్యాయ పోస్టులను కూడా కలిపి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తారని మరోప్రచారం ఉంది. ఇదిలాఉండగా ఉమ్మడి జిల్లాలో కొత్త డీఎస్సీకి నోటిఫైచేసే ఉపాధ్యాయపోస్టుల సంఖ్యపై ఇంతవరకు ఎటువంటి అధికారిక సమాచారం లేదని విద్యాశాఖవర్గాలు స్పష్టం చేశాయి. పాఠశాలలవారీగా ప్రభుత్వం వద్ద వున్న యూ-డైస్ సమాచారంతో నియామకాల సంఖ్యను నిర్ధారిస్తారని తెలిపాయి.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న భరతలక్ష్మి

పెదవేగి, జనవరి 23 : రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని, అప్పుడే ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. ప్రధానంగా చిరుధాన్యాల సాగు లాభసాటిగా ఉంటుందని ఆమె చెప్పారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ఏలూరు ఏరువాక కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా పెదకడిమి రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాల సాగు, విలువల జోడింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని చెప్పారు. నీటిఎద్దడిని సైతం తట్టుకుని దిగుబడులు వస్తాయని, రైతులు చిరుధాన్యాల సాగువైపు మళ్లాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, పెద్దాపురం వ్యవసాయ పరిశోధనాకేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం, ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ టి.సుజాత, ఉండి కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.డెబోరా, పెద్దాపురం వ్యవసాయ పరిశోధనాకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్, విజయవాడ సీపీపీఐ ప్రధాన శాస్త్రవేత్త వీరబాబు, ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, ఏడీఏ శ్రీదేవి, ఏవో ఎం.ప్రియాంక పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థుల బ్యాండ్ ట్రూప్

గురుకుల బ్యాండ్‌కు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 23: పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల బ్యాండ్ ట్రూప్ జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఈనెల 21, 22 తేదీల్లో జాతీయస్థాయిలో 14 పాఠశాలలు పాల్గొన్న బ్యాండ్ పోటీల్లో బాలుర విభాగంలో సౌత్‌జోన్ తరఫున ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు వివరించారు. బ్యాండ్ ట్రూప్‌ను సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సెక్రటరి మహేష్‌కుమార్, రాష్ట్ర సమగ్ర అభియాన్ అధికారి శ్రీనివాసరావు, మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారు.

కల సాకారమయ్యేనా..!



భద్రాచలం-కొవ్వూరు రైల్వేమార్గం ప్రతిపాదనలు బుట్టదాఖలేనా?

- బడ్జెట్ నిల్.. సర్వేలతోనే సరిపెడుతున్న కేంద్రం
- ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రభుత్వాలకు ఏటా రూ.200 కోట్ల ఆదాయం
- అభివృద్ధిపై దృష్టిపెట్టని పాలకులు

ఏలూరు క్రైం, జనవరి 23 : దేశం అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం ఎంతో ముఖ్యం. రోడ్డు, జల, రైల్వే, వాయు మార్గాలు త్వరితగతిన అభివృద్ధి చేస్తే ఏ దేశమైనా ప్రపంచపటంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుతుంది. జిల్లాలో పండుతున్న వాణిజ్య పంటలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో సిరిసంపదలు కురిపిస్తున్నా కనికరం లేకుండా పోతోంది.

1925 ఏప్రిల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడింది. అప్పట్లో పెదవేగి, తాడేపల్లిగూడెంలలో విమానాశ్రయాలు ఉండేవి. ఇవి రెండో ప్రపంచ యుద్ధంలో ఇంధనం నింపుకోవడానికి ఏర్పాటు చేసినవే అయినప్పటికీ ఆ తరువాత రవాణాకు ఉపయోగించారు. క్రమేపీ అవి అంతరించిపోయాయి. తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో నిట్ ఏర్పాటు చేయగా, పెదవేగి విమానాశ్రయమార్గాన్ని జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డుగా మార్చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం-కొవ్వూరు రైల్వేమార్గం ఆవశ్యకతను 1948-49లోనే గుర్తించారు. మరలా 1950-55 మధ్య, 1972 ఆగస్టులో పోస్టల్ ఇండెక్స్ నెంబర్ వ్యవస్థను దేశం మొత్తం అమలు చేసే సమయంలో కూడా భద్రాచలం- కొవ్వూరు రైల్వే మార్గం వల్ల రాజమహేంద్రవరం, విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ల నుంచి నడిచే రైళ్లకు అవసరమైన బొగ్గును తెలంగాణ నుంచి సరఫరా చేయడానికి రైలు మార్గం ఎంతో ముఖ్యమని భావించారు. బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయలేకపోయారు. 1990-91 కేంద్ర బడ్జెట్‌లో కొద్దిపాటి నిధులను కేటాయించి సర్వే జరిపించారు. భద్రాచలం నుంచి కొవ్వూరుకు 170 కిలోమీటర్ల రోడ్డు మార్గం ఉండగా రాజమండ్రి వరకు 180 కిలోమీటర్లు వస్తుంది. రైలు మార్గం భద్రాచలం నుంచి కొవ్వూరుకు 154 కిలోమీటర్లు వస్తుందని అంచనా వేశారు. అటవీ ప్రాంతం మీదుగా వాగులు, వంకలు, కాలువలు ఉండడంతో 78 చిన్న పెద్ద బ్రిడ్జిలు కట్టాల్సివస్తోందని గేట్లు కూడా ఎక్కువే పెట్టాల్సి వస్తోందని గుర్తించారు. అయితే అటవీ ప్రాంతం మీదుగా రైలు మార్గం వేయాలంటే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది.

భద్రాచలం నుంచి కొవ్వూరుకు రెండు రకాల రైలు మార్గాలను ప్రతిపాదించారు. ఒకటి అత్యంత దగ్గరగా భద్రాచలం నుంచి దమ్మపేట, అశ్వరావుపేట, కామయ్యపాలెం, గంగన్నగూడెం, స్వర్ణవారిగూడెం, మైసన్నగూడెం, శ్రీనివాసపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, చిక్కాల, గౌరీపట్నం మీదుగా పతిపాదనలు చేశారు. భూ సేకరణకు ఎంత ఖర్చు అవుతుందో నిర్ణయించారు. కేవలం సర్వేలకు మాత్రమే పరిమితం అయింది. ఆ ప్రాంతానికి చెందిన నేతలు భద్రాచలం ఎంపీగా, కేంద్ర మంత్రులుగా పనిచేసినప్పటికీ ఎలాంటి అభివృద్ధి చేయలేదంటూ ఆప్రాంత వాసులు చెబుతున్నారు. పోలవరం, చింతలపూడి, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ప్రజలకు ఈ రైల్వే మార్గం ఎంతో దోహదపడుతుంది. వాణిజ్య పంటలైన వర్జీనియా పొగాకును అత్యధికంగా ఈ ప్రాంతాల్లోనే పండిస్తు ఉంటారు. కేంద్ర ప్రభుత్వానికి ఏడాదికి పన్నుల రూపంలోనే లక్షా 25 వేల కోట్లు విదేశీ మాదకద్రవ్యం లభిస్తుంది. పామాయిల్ తోటలు విరివిగా ఉండడంతో ఇక్కడే ఫ్యాక్టరీలు కూడా వెలిశాయి. కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రూ. 60 వేల కోట్లు విదేశీ సుంకాన్ని చెల్లించేది. ప్రస్తుతం ఈ భారం తగ్గిపోయింది. వివిధ పంటల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏడాదికి రూ.200 కోట్లు పన్నుల రూపంలో వెళ్తున్నప్పటికి అభివృద్ధిని ఏఒక్క నాయకుడు పట్టించుకోలేదు. తెలంగాణ నుంచి నిత్యం వందలాది గ్రానైట్ లోడు లారీలు అశ్వారావుపేట నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా రాజమండ్రి నుంచి కాకినాడ పోర్టుకు వెళ్తానే ఉంటాయి. భద్రాచలం నుంచి కొవ్వూరు వరకూ రైలు మార్గం ఉంటే అతి తక్కువ ఖర్చుతో రవాణా జరిగేది. రోడ్డు మార్గంలో గ్రానైట్ లోడు లారీలు వెళ్లడంతో జీలుగుమిల్లి నుంచి దేవరపల్లి వరకూ రహదారులు ధ్వంసమౌతున్నాయి. మెట్ట ప్రాంతంలో వర్జీనియా పొగాకు, పామాయిల్, జీడిమామిడి, మామిడి, వరి, నిమ్మ పంటలు పండిస్తున్నారు. వీటి రవాణాకు రైల్వే మార్గం ఎంతో ముఖ్యమని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఈసారి బడ్జెట్‌లోనైనా జిల్లాకు చెందిన ఎంపీ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో పనులు చేపట్టేందుకు కృషిచేస్తారా లేదా అని ఈ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోవైపు చింతలపూడి ప్రాంతంలో బొగ్గుగనులు విరివిగా ఉన్నాయి. అవి జంగారెడ్డిగూడెం వరకు విస్తరించి ఉన్నాయి. ఈ రైలు మార్గం అభివృద్ధికి అవకాశాలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కేవలం ప్రకటనలకే పరిమితమైపోతున్నాయి. భద్రాచలం నుంచి కొవ్వూరు రైలు మార్గం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కలగానే మిగిలిపోతోంది.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా



ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లను సత్కరిస్తున్న జోనల్ చైర్మన్ పిన్నింటి

భీమవరంటౌన్, జనవరి 23 : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్ హామీ ఇచ్చారు. జోనల్ చైర్మన్‌గా బాధ్యలు చేపట్టి మొదటిసారిగా భీమవరం డిపో పరిశీలన నిమిత్తం సోమవారం వచ్చిన ఆయన కార్మికులతో మాట్లాడారు. ఈనెల 30న బోర్డు మీటింగ్ జరుగుతుందని, ఈ విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. జోన్‌కు కొత్తగా 400 బస్సులు రానున్నాయని, వాటిని డిపోల వారీగా అందించటం జరుగుతుందన్నారు. వర్షం వస్తే గ్యారేజీ మునిగిపోతుందని, బస్సులు దెబ్బతింటున్నాయని, గతంలో చాలాసార్లు ప్రతిపాదనలు చేసి పంపినా నిధులు మంజూరు కాలేదని సంఘ నేతలు ఆయన దృష్టికి తెచ్చారు. డిసెంబరులో అత్యధిక కెఎంపిఎల్, అత్యధిక ఆదాయం తెచ్చిన డ్రైవర్‌లు ఎన్.ఎ.నారాయణ (ప్రథమ), ఎస్‌వి.ఎస్.ఎ.రావు (ద్వితీయ),ఎస్.ఎం.రావు(తృతీయ)లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కండక్టర్‌లు కె.పద్మావతి (ప్రథమ), వి.రాంబాబు(ద్వితీయ), జె.ఎచ్.ఎస్.ప్రసాద్ (తృతీయ)లను అభినందించి ఒక్కొక్కరికి రూ.500, రూ.400, రూ.300 నగదు, ప్రశంసా పత్రాలను అందించారు. డిపో మేనేజర్ పి.ఎస్.వి.ఎం.సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, గుండా రాంబాబు, బాలసుబ్రహ్మణ్యం, యూనియన్ నేతలు అల్లం నారాయణ, డి. విజయ్‌కుమార్, సోమరాజు, రమేష్‌బాబు, వైవిరావు ఉన్నారు.

ఏఎన్‌ఎంలకు కులగణన విధులపై అభ్యంతరం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన విధులను గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలకు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఎన్‌ఎంలను వైద్యేతర కార్యకలాపాలకు వినియోగించడం అభ్యంతరకరమని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు అన్నారు. ఏలూరు జిల్లాలో 600 మందికిపైగా ఏఎన్‌ఎంలకు కులగణన విధులు కేటాయిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీచేశారని, ఏఎన్‌ఎంలను వైద్యేతర విధులకు వినియోగించరాదని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎం.టి.కృష్ణబాబు జారీచేసిన సూచనలను అధికారులు విస్మరించడం విచారకరమన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణం వేగవంతం చేయాలి

పాలకొల్లు రూరల్, జనవరి 23: మండలంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను మంగళవారం నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ తనిఖీ చేశారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అత్యవసర బ్లాక్, ఓపీడి బ్లాక్ పైల్ ఫౌండేషన్‌కు జరుగుతున్న కాంక్రీట్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

పూలశాస్త్ర పరిశోధనలో ప్రణతికి జాతీయ పురస్కారం



ప్రణతిని అభినందిస్తున్న జానకిరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 23: పూలశాస్త్ర పరిశోధనలో అత్యుత్తమ థీసెస్ సమర్పించిన యువ శాస్త్రవేత్త కేటగిరిలో డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయ ఉద్యానకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి ప్రణతి జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. గుజరాత్‌లోని నౌసారి వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయస్థాయి హార్టీకల్చర్ కాంక్లేవ్‌లో పీహెచ్‌డీ కోర్సుల్లో అత్యుత్తమ పరిశోధనా పత్రం సమర్పించిన ప్రణతికి ఈ అవార్డు లభించింది. ఆమెను ఉపకులపతి డాక్టర్ టి. జానకిరామ్ మంగళవారం అభినందించారు.



నీరందక నెర్రలు

కళింగగూడెంలో సాగునీటి కష్టాలు

ఆకివీడు రూరల్/ఆకివీడు, జనవరి 23 : వరి పొలాలు నెర్రలు తీస్తున్నాయి. సాగునీటికి రైతులు ఎదురు చూస్తున్నారు. కళింగపాలెం లాకులు ప్రాంతంలో వెదజల్లిన వరి పొలాలు సాగునీరు అందక బీటలు వారాయని, పొలాల్లో నడిచి వెళ్లవచ్చని రైతులు వాపోతున్నారు. పాతవయ్యేరు శివారు ప్రాంతం కావడంతో సాగునీరు ఇప్పటివరకు చేరలేదని, నీరందకపోతే చేను చనిపోతుందని చెబుతున్నారు. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని రైతు తాండ్ర జోగిరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

నారు కొరత.. ఎకరానికి రూ.7 వేలు అదనపు ఖర్చు



ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న వరినారు

మిచౌంగ్ తుఫాన్ ప్రభావం చినమిల్లిపాడు, రాజులపేట రైతులను వెంటాడుతోంది. నారు కొనుగోలు చేసి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దాళ్వా ప్రారంభ సమయంలో రైతులు వేసిన ఆకుమడులు ముంపునకు గురయ్యాయి. చేలలో నీరు తగ్గకపోవడంతో ఎకరానికి రూ.7 వేలు పెట్టి వరి నారు ఇతర గ్రామాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు నేటికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నామంటున్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, జనవరి 23 : ఓ మహిళను దిండుతో ఊపిరాడకుండా హత్య చేసి, ఆపై ఆమె ఉరి వేసుకున్నట్టు సాక్ష్యాలు తారుమారు చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదు, రూ. పది వేల జరిమానా విధిస్తూ ఏలూరులో ఎనిమిదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం.సునీల్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన అల్లాడి దుర్గ.. భర్త మరణించడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమెకు కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌కు చెందిన బెజవాడ వీరవెంకట శివశంకర్ అలియాస్ శివశంకర్ (24)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొంత కాలం సహజీవనం చేసి విడిపోయారు. ఈ నేపథ్యంలో 2015 డిసెంబరు 13న తన కోరిక తీర్చాలంటూ దుర్గను కోరాడు. ఆమె నిరాకరించడంతో దిండు తలపై పెట్టి ఊపిరి ఆడకుండా చేశాడు. అనంతరం చీరతో ఉరేసుకున్నట్లుగా చిత్రీకరించి పారిపోయాడు. మృతురాలి తల్లి పోరుకొండ ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పెదపాడు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేయగా, ఏలూరు డీఎస్పీ కె.బి.జి. సరిత కేసు దర్యాప్తు చేసి హంతకుడిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీటు వేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయాధికారి తీర్పు చెప్పారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాణీభాయ్ వాదించగా, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసరావు, పెదపాడు ఎస్‌ఐ చల్లాకృష్ణ, కోర్టు కానిస్టేబుళ్లు సిహెచ్.క్రాంతికుమార్, పవన్‌కుమార్ సహకరించారు. వీరిని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్‌కు గాయాలు

జంగారెడ్డిగూడెం, జనవరి 23: రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ చేస్తున్న ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలివి. పట్టణానికి చెందిన సుంకవల్లి రవి ఫుడ్‌డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక బాలాజీ నగర్‌కు ఫుడ్ డెలివరినిమిత్తం మంగళవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా హైవేపై కొయ్యలగూడెం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో రవి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైటర్ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం, జనవరి 23: వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. పట్టణానికి చెందిన ఓ వివాహిత ఈనెల 21 నుంచి అదృశ్యమైంది. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల వెదికినా కన్పించకపోవడంతో మంగళవారం ఆమె భర్త ఫిర్యాదుతో స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోగొట్టుకున్న ఫోన్ దుబాయ్ భక్తురాలికి అందజేత

ద్వారకాతిరుమల, జనవరి 23: స్వామి దర్శనానికి శ్రీవారి క్షేత్రానికి వచ్చి ఓ ఖరీదైన ఫోన్ పోగొట్టుకున్న విదేశీ భక్తురాలికి తిరిగి ఆ ఫోన్‌ను అప్పగించారు. వివరాలివి. దుబాయ్‌లో ఉంటున్న శ్రావ్య అనే భక్తురాలు మంగళవారం చినవెంకన్న దర్శనార్థం ద్వారకాతిరుమల వచ్చారు. స్వామి దర్శనం అనంతరం ఆమె తన ఫోన్ పోగొట్టుకున్నట్టు గుర్తించారు. ఆలయ ప్రాంగణంలో ఆఫోన్‌ను గుర్తించిన ఆలయ సెక్యూరిటీ మైక్‌లో అనౌన్స్ చేశారు. దీంతో ఆమె గుర్తులు చెప్పగా దానిని అప్పగించారు.

లారీ ఆఫీసులో స్క్రాప్ చోరీ..

- పోలీసులకు నిందితుడి అప్పగింత

ఆకివీడు, జనవరి 23: లారీఆఫీసులో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలివి. స్థానిక గుమ్ములూరు రోడ్‌లో ఉంటున్న గంధం సుబ్బారావుకు చెందిన లారీ ఆఫీసులో చిత్తు కాగితాలు ఏరుకొనే వ్యక్తి మంగళవారం స్క్రాప్ దొంగతనం చేస్తుండ పట్టుబడ్డాడు. దొంగను పోలీసులకు అప్పగించారు. ఆఫీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి వస్తువుల అపహరణ

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : విధులకు వెళ్లి వచ్చేలోగా ఓ హెల్త్ సూపర్‌వైజర్ ఇంట్లో దొంగలుపడి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు.. వివరాలివి. పట్టణంలో నివాసం ఉంటున్న అల్లాడి సరస్వతి తాడువాయి పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం తాడువాయి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు, బీరువా తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించింది. రెండున్నకాసుల బంగారం, వెండివస్తువులు, రూ.20 వేలు అపహరణకు గురైనట్టు గుర్తించి మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేశారు.

పోలీసులు అదుపులో 8 మంది కోడిపందేలరాయుళ్లు

జంగారెడ్డిగూడెం, జనవరి 23 :కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి. శ్రీనివాసపురం శివారులో మంగళవారం కోడిపందేలు వేస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.3,400, రెండు కోళ్లు, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బెల్టు షాపుపై..

పట్టణంలోని బాలాజీ నగర్‌లో బెల్ట్ షాపుపై మంగళవారం పోలీసులు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.540 విలువ చేసే నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆరో రోజూ సెల్‌టవర్‌పైనే..

భీమవరం క్రైం, జనవరి 23 : తనకు రావాల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ గత ఆరు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సెల్‌టవర్‌పైనే ఉన్నాడు. గురువారం ఉదయం ఎక్కిన అతడు మంగళవారం రాత్రి కూడా దిగలేదు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా కూడా అతడు కిందకు దిగడం లేదు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు దెందులూరు వాసి



వినోద్ కుమార్

దెందులూరు, జనవరి 23 : ఢిల్లీలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు దెందులూరుకు చెందిన కొత్తపల్లి వినోద్ కుమార్ ఎంపికయ్యాడు. కొప్పాకలో ఆయుష్మాన్ భారత్, ఆయుష్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకుడిగా అతడు పని చేస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాధిక్ ఖాన్.. వినోద్‌ను ఎంపిక చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అతడు మంగళవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లాడు. ప్రధాని మోదీతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొనే వేడుకల్లో యోగాపై అవగాహన కల్పించనున్నారు.

చల్లావారిగూడెం నిర్వాసితకాలనీలో సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్



నిర్వాసితులతో మాట్లాడుతున్న పట్నాయక్

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : మండలంలోని చల్లావారిగూడెంలో నిర్మించే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్ పర్యటించారు. త్వరలో తెరకెక్కనున్న ఓ చిత్రానికి సంబంధించిన కథ కోసం ఆయన నిర్వాసిత కాలనీలో పర్యటించి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అతి త్వరలోనే ఈప్రాంత పరిసరాలలో షూటింగ్ చేసే ఉద్దేశం ఉన్నట్లు కాలనీవాసులతో చర్చించారు. కాలనీ యూత్ అధ్యక్షుడు బద్దె ప్రేమ్ కుమార్, కమిటీ సభ్యులు చింతపల్లి వీరబ్రహ్మం, పెరుమళ్ల నరసింహరావు, మిరియాల పుల్లారావు ఉన్నారు.

రేపు షర్మిల ఏలూరు రాక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ఏలూరు కార్పొరేషన్)



కల్యాణ మండపంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పద్మశ్రీ, గురునాథం

ఏపీసీసీ చీఫ్ షర్మిల ఈనెల 25న ఏలూరు రానున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన కార్యక్రమం ఖరారైంది. తొలిసారిగా పీసీసీ చీఫ్ హోదాలో వస్తున్న షర్మిలకు ఘన స్వాగతం పలకడంతోపాటు సాధ్యమైనంత మేర కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ సీనియర్లు రంగంలోకి దిగారు. కాకినాడలో సభ ముగించుకుని నేరుగా గురువారం సాయంత్రం ఐదు గంటలకు షర్మిల ఏలూరు చేరుకుంటారు. కంద్రికగూడెం సుఖీభవ కల్యాణ మండపంలో ఏర్పాట్లను మంగళవారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, నరసాపురం పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ జెట్టి గురునాధరావు, ఏలూరుజిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్, పశ్చిమగోదావరి జిల్లా అధ్య క్షుడు మార్నీడి బాబీ, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డి.వి.ఆర్.కె.చౌదరి పరిశీలించారు. షర్మిలకు ఘన స్వాగతం పలికేందుకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు ఏలూరు రానున్నారు. ఏలూరు పాతబస్టాండ్ నుంచి భారీ స్వాగతంతో ఆమెను నగరంలోకి ఆహ్వానించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జెట్టి గురునాధరావు వెల్లడించారు. షర్మిల సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వాల విధానాలతో సంక్షోభంలో ఆక్వారైతు



మాట్లాడుతున్న గొట్టుముక్కల

పాలకొల్లు, జనవరి 23: ఆక్వా రైతు సంక్షోభంపై ఈనెల 20న పాలకొల్లులో నిర్వహించిన 2కె ర్యాలీ, సభ విజయవంతమైందని జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. స్థానిక సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాలకొల్లు, నరసాపురం, ఆచంట, భీమవరం, ఉండి, మహదేవపట్నం, కృష్ణాజిల్లా బంటుమిల్లి, ఏలూరు జిల్లా కలిదిండి, తూర్పుగోదావరి జిల్లా మల్కిపురం, రామేశ్వరం నుంచి ఆక్వారైతులు వేలాదిగా పాల్గొని సంఘీభావం తెలిపారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ఆక్వారైతు తీవ్ర సంక్షోభంలో పడ్డారన్నారు. సీడ్, హేచరీస్, ప్రొసెసింగ్ యూనిట్ల సమస్యలను పరిష్కరించాలని సభ ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. మార్చి 31నాటికి సమస్యలను పరిష్కరించాలని ఆల్టిమేటం జారీచేశామన్నారు. బోనం వెంకట నర్సయ్య, ఫణీంద్రుడు పాల్గొన్నారు.

స్పీడ్‌గన్‌తో వాహన వేగం తనిఖీ



వాహన వేగాన్ని స్పీడుగన్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జనవరి 23 : పదహారవ నెంబర్ జాతీయ రహదారిపై అతి వేగంగా వెళ్తున్న వాహనాలను స్పీడ్ గన్‌తో పోలీసులు, రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసి జరిమానాలు విధించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు మంగళవారం వాహన నియంత్రణ చర్యలు చేపట్టారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ బద్దు నాయక్, ఏలూరు రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి తనిఖీలు చేపట్టి అతి వేగంగా వెళ్తున్న ఎనిమిది వాహనాలకు జరిమానా విధించారు.

మద్ది ఆంజనేయుడికి విశేష పూజలు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం, జనవరి 23 : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామునే అర్చకులు స్వామికి ప్రభాతసేవ, నిత్యార్చన, తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వివిధ సేవల రూపంలో రూ.12,78,194 ఆదాయం వచ్చినట్టు ఈవో ఆకుల కొండలరావు చెప్పారు.



సత్యవోలులో జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

టీడీపీతో బీసీల సమగ్రాభివృద్ధి : చింతమనేని

పెదపాడు, జనవరి 23: బీసీల సమగ్రాభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సత్యవోలులో మంగళ వారం రాత్రి జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. చింతమనేని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీ సంక్షేమాన్ని నీరుగార్చిందన్నారు. బీసీలను జగన్మోహన్‌రెడ్డి అన్నివిధాలుగా మోసగించారని విమర్శించారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందుకు మీరంతా వెన్నంటి ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని, దాంతో బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందని చింతమనేని తెలిపారు. పార్టీ జయధ్వానాల నడుమ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జయహో బీసీ కార్యక్రమానికి చింతమనేని ప్రభాకర్ భారీ ర్యాలీగా తరలి వచ్చారు. రామచంద్రపురం వద్ద టీడీపీ శ్రేణులతో పాటు జనసేన నాయకులు బాణసంచా కాల్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి వందల సంఖ్యలో మోటారుసైకిళ్లు, కార్లు వెంట రాగా చింతమనేని పాదయాత్రగా ముందుకు కదిలారు. మార్గమధ్యలో మహిళలు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో మోరు శ్రావణి, లావేటి శ్రీనివాసరావు, ఘంటశాల వెంకటలక్ష్మి, గుత్తా అనిల్, మట్టా శ్రీనివాసరావు, ఉప్పలపాటి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జనవరి 23: ప్రతి వ్యక్తి ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో పర్యావరణ పరిక్షణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ చెట్లను నాటడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఉపయోగించడం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఏలూరు జిల్లా పర్యావరణ పరిక్షణ ఇంజనీర్ ఇ.వెంకటేశ్వర్ మాట్లాడుతూ వ్యర్థాలను సరైన పద్ధతిలో రీసైకిలింగ్ చేయడం వల్ల ఇంధన ఉత్పత్తి చేయవచ్చునన్నారు. పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ఎలక్ట్రానిక్, ఆసుపత్రుల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నాశనం చేయాలని, ప్లాస్టిక్ సంచులను వినియోగాన్ని తగ్గించి జ్యూట్ వినియోగాన్ని ఉపయోగించాలన్నారు. మున్సిపల్ ఏఈ శేషగిరిరావు, ప్యానల్ లాయర్లు వెంకటేశ్వరరావు, కూన కృష్ణారావు, కట్టా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

26న 'లౌకిక జనకవనం' సమ్మేళనం



బ్యానర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23: రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న వైఎంహెచ్ఏ హాలులో లౌకిక జనకవనం పేరిట కవి గాయక కళా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు గుడిపాటి నరసింహారావు తెలిపారు. ఏలూరులోని అన్నే భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రచార సామగ్రిని విడుదల చేశారు. రాజ్యాంగ విలువలపై కవితా గానం, అంబేడ్కర్ వేషధారణలు, ఏకపాత్రలు, పాటలు, సందేశాలు సమ్మేళనంలో ఉంటాయన్నారు. రాజ్యాంగం ప్రత్యేకత, ప్రాధాన్యం, కవితలు, పాటలు, నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. నిర్వాహకులు రాములు, హేమసుందర్, సురేష్, ఆంజనేయులు, శారద, గణేష్, లక్ష్మి, సురేష్, రాజ్యలక్ష్మి, చందన, కస్తూరిరావు, సిద్దార్థసాయి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో నూరు శాతం విజయం సాధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో

ఏలూరు రూరల్, జనవరి 23: పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో శ్యాం సుందర్ అన్నారు. శనివారపుపేట, జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్ఎం రవిప్రకాష్ ఉన్నారు.

ల్యాండ్ టైటిల్ చట్టంపై న్యాయవాదుల నిరసన



గంగిరెద్దుకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం, జనవరి 23: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని న్యాయవాదులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగిరెద్దుకు న్యాయవాదులు మెమొరాండం సమర్పించారు. సీనియర్ న్యాయవాదులు టీఎస్ఎన్.మూర్తి, పొన్నా లక్ష్మణరావు, పీవీ కృష్ణారెడ్డి, మాడా రామ్మోహన్‌రావు, కె.సతీష్, మానికల సూరిబాబు, మేకల రామ్మోహన్‌రావు, మాదేపల్లి క్రాంతి కుమార్, సొబ్బన ఆనంద్, ఉద్దండం ఏసుబాబు, జువ్వల బాబ్జీ, ఎం.నాగులు, ఏవీవీ భువనేశ్వరి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణకిశోర్

లింగపాలెం, జనవరి 23: కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలోని మెట్టగొల్లగూడెంలో డాక్టర్ కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిలువకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు గ్రామంలో ప్రతిరోజూ సర్వే నిర్వహించాలని, ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వారికి తగుసూచనలు ఇవ్వాలన్నారు. వైద్యసహాయం అవసరమైతే వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని తెలిపారు. ఏఎన్ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌వి శ్రీవల్లి, ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు

టి.నరసాపురం, జనవరి 23: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని వైద్యాధికారి ఎం.ఆంజనేయులు తెలిపారు. బొర్రంపాలెం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉంటే సమీపంలోని వైద్య కేంద్రాలకు రావాలని ఆయన సూచించారు. శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాపీ డ్రైవర్స్

ఏలూరు రూరల్, జనవరి 23: రాష్ట్రరోడ్డురవాణా సంస్థ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా మంగళవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఎంతోమంది క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడంతో పాటు బస్సులో ప్రయాణించి విద్యార్థులు చదువులు చదువుకుని అత్యున్నత స్థాయిలో ఉన్నారు. క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ డ్రైవర్లను ప్రతిఒక్కరూ గౌరవించాలని ప్రజారవాణాశాఖ అధికారి ఎన్‌వీఆర్.వరప్రసాద్ అన్నారు. నిత్యం బస్సుల్లో ఉద్యోగులు, ప్రయాణికులు, విద్యార్థులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లను అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమం, అభివృద్ధి : కొఠారు

పెదపాడు, జనవరి 23 : ప్రతి ఒక్కరికి సంక్షేమం, అభివృద్ధిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. మండలంలో కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో మంగళవారం ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీపీ బత్తుల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి





కామవరపుకోట, జీలుగుమిల్లిలో పోలింగ్ బూత్‌లు పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య, రెవెన్యూ సిబ్బంది



నిడమర్రులో నేతలతో ఆర్డీవో ఖాదర్‌వలీ సమావేశం

ఓటర్ జాబితా సిద్ధం

రాజకీయ నేతలతో అధికారుల సమావేశం

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చింతలపూడి, జనవరి 23: నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా అధికారులు సిద్ధం చేశారు. తుది జాబితాపై పలు నియోజకవర్గాల్లో రాజకీయ నేతలతో అధికారులు సమావేశమయ్యారు. పోలింగ్ బూత్‌లు పరిశీలిస్తున్నారు. చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో మొత్తం 273 పోలింగ్ బూత్‌లు ఉండగా ఫైనల్ జాబితాలో మొత్తం ఓటర్లు 2,71,502 మందిగా నమోదయ్యారు. పురుషులు 1,33,747, మహిళలు 1,37,714, ట్రాన్స్‌జెండర్స్ 41 మంది ఉన్నారు. చింతలపూడి మండలంలో పురుషులు 36,571, మహిళలు 37,778, జంగారెడ్డిగూడెం మండలంలో పురుషులు 48,884, మహిళలు 50,936, కామ వరపుకోట మండలంలో పురుషులు 24,878, మహిళలు 25,586, లింగపాలెం మండలంలో పురుషులు 23,414, మహిళలు 23,414 మంది నమోదయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళ వారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి సమీక్ష నిర్వహించి వివరాలు అందజేశారు. అక్టోబరు 23 నుంచి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ చేయగా 30,675 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించి అనర్హు లను తొలగించామని, అర్హులుగా 2,71,502 మందిగా గుర్తించి నమోదు చేసి నట్లు వివరించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహి స్తామని చెప్పారు. అనంతరం జడ్పీ పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలో 12 పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో పద్దయ్య మంగళవారం పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఆర్ఐ కొమ్మిన రథసారధి, డిటి శేషగిరి, వీఆర్వోలు లక్ష్మీనారాయణ, రమేష్, వల్లి, లక్ష్మీదేవి ఉన్నారు.

● జీలుగుమిల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో కె.అద్దయ్య మంగళవారం పరిశీలించారు. అనంతరం బుధవారం గిరిజన ఆశ్రమ పాఠశాల్లో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఏర్పాట్ల వివరాలు అడిగారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

● నిడమర్రు: నియోజకవర్గంలో రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో ఖాదర్‌వలీ సమావేశమయ్యారు. ఓటర్ల తుది జాబితా పరిశీలించి సూచనలు చేయాలన్నారు. తహసీల్దార్లు సాయిరాజ్, శ్రీలక్ష్మి, రమణారావు, ఇందిరా గాంధీ, ఎంపీడీవోలు విజయకుమారి, కిరణ్మయి, నాయకులు పాల్గొన్నారు.

● దెందులూరు: ఓటర్ల జాబితాపై తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ నాంచారయ్య ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో లోపాలుంటే అవసరమైన దరఖాస్తులను పూర్తి చేసి బీఎల్వోలకు అందించవచ్చన్నారు. సమావేశంలో తహసీల్దార్లు విజయకుమార్, నాగరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.









నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, భీమడోలులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

టీడీపీకి అధికారంలోకి రాగానే

పేదల సమస్యల పరిష్కారం

లోకేశ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ నేతలు

ఏలూరు టూటౌన్, జనవరి 23: లోకేశ్ జన్మదిన వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఏలూరు, దెందులూరు, నియోజకవర్గాల టీడీపీ నేతలు, కార్యకర్తల సమక్షంలో ఏలూరులో మంగళవారం భారీ కేక్ కట్ చేశారు. తొలుత టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ర్యాలీగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చంటి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సమస్యలను యువగళం పాద యాత్ర ద్వారా తెలుసుకున్న లోకేశ్ టీడీపీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తాడన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెనుబోయిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, పూజారి నిరంజన్, జాలా బాలాజీ, లంకపల్లి మాణిక్యాలరావు, చోడే వెంకటరత్నం, శివప్రసాద్, చవ్వా అరుణకుమారి, కడియాల విజయలక్ష్మి, జంపా సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తారని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో రావూరి కృష్ణ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. బొమ్మాజి అనిల్, తూటికుంట రాము, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, నంబూరి రామచంద్రరాజు, ఆకుమర్తి రామారావు, పగడం సౌభాగ్యవతి, అబ్బిన దత్తాత్రేయ, రాజాన సత్యనారాయణ, కంపా రాజేంద్రబాబు, చెరుకూరి శ్రీధర్, అల్లూరి రామకృష్ణ, పెసర గంటి జయరాజు, షేక్ నజీర్, షేక్ యాకూబ్, కన్నా కృష్ణ, నత్త నాగేంద్ర, చేను ప్రసాద్, కోటగిరి ప్రమీల, కాసాని ప్రసాద్, అభిరామ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: లోకేశ్ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, రామారావు, నరేష్, జ్యేష్ట రామకృష్ణ, రాజనాల సత్యనారాయణ, నిమ్మగడ్డ రవీంద్రనాథ్, రాచూరి మధన్, చింతల వెంకటరమణ, ఆకుల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మెట్టగూడెంలో మొడియం సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. యాళ్ళ లీలాప్రశాంతి, పక్కాల వెంకటేశ్వరరావు, బోడా అనీష్‌కుమార్, పల్లె శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కామవరపుకోట: కొత్తూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, కిలారు సత్యనారాయణ, ఖాన్ వజీర్, తూతా లక్ష్మణరావు, ఘంటా సుధీర్‌బాబు, షేక్ వలీ, వీరబాబు, పలువురు సర్పంచ్‌లు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెదపాడు: లోకేశ్ పుట్టినరోజు వేడుకలు కొత్తూరులో ఘనంగా జరిగాయి. తెలుగు యువత మండల అధ్యక్షుడు కొత్తూరు చినబాబు ఆధ్వర్యంలో 50 కేజీల కేక్‌ను చింతమనేని కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● భీమడోలు: నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా గాంధీ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. టీడీపీ మహిళా అధ్యక్షురాలు కమ్మ పద్మ ఆర్థిక సహాయంతో మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధర్మాజీగూడెంలో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యకర్తలకు, గ్రామస్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పాతూరి శ్రీనివాసరావు (స్వామి), పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోలవరం: లోకేశ్ జన్మదినం సందర్భంగా ఏటిగట్టు సెంటర్‌లో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు భారీ కేక్ కట్ చేశారు. జల్లేపల్లి వెంకట నరసింహారావు, గుబ్బా రాంబాబు, మంగిన కొండ, కుంచే దొరబాబు, బొడ్డు కృష్ణ, పోతుల శ్రీను, నల్లా రాంబాబు, యడ్ల వినోద్, పిల్లి నాగరాజు, పాదం ప్రసాద్, ఇల్లా సత్యనారాయణ, ఆకుల రాజా, కపిలవాయి సత్యనారాయణ, మజ్జి అప్పారావు, కొత్తపల్లి సత్యనారాయణ, మజ్జి అప్పారావు, తాడేపల్లి మలాకీ, జితేంద్ర, రెల్లి కొండ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: అనూరాధ చిన్న పిల్లల ఆశ్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు నాయకత్వంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నిత్యావసరాలు, పండ్లు, దుప్పట్లు అందజేశారు. రెడ్డి సూర్యచంద్రరావు, పాతూరి విజయకుమార్, నల్లా ఆనంద్, సప్పా వీరబాబు, నేకూరి ఆశీర్వాదం, దిడ్ల ఆనంద్, బండారు మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.









చింతలపూడిలో మహిళలకు చీరల పంపిణీ, బుట్టాయగూడెం ఆస్పత్రిలో పండ్లు పంపిణీ, పోలవరం, లింగపాలెం మండలాల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

యువతకు స్ఫూర్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్



చింతలపూడిలో నేతాజీ విగ్రహం వద్ద నివాళి

జంగారెడ్డిగూడెం, జనవరి 23: స్వాతంత్ర్యం పోరాడి సాధించుకునేదని యువతలో స్ఫూర్తి నింపిన ధీరుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ అని కేవీఆర్ సత్యనారాయణ, వాసా సత్యనారాయణ అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా పట్టణంలోని విగ్రహానికి కె.దుర్గాప్రసాద్, బికె విశ్వనాథ్, గొలుగూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి, మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అని యువతలో చైతన్యం నింపడమే కాక, అజాద్ హింద్ ఫౌజ్ అనే సేనను స్థాపించిన ఉద్యమ కారుడు సుభాష్ చంద్రబోస్ అన్నారు. జయంతి తప్ప వర్ధంతి లేని పోరాట యోధుడు నేతాజీ అన్నారు.

● చింతలపూడి: స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. వీరంకి శ్రీనివాసరాయుడు, ఎ.అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రబోస్ ధైర్య సాహసాలను, ఆశయాలను అనుసరించాలని, సమాజంలో అసమానతలను తొలగాలని, సుపరిపాలన రావాలని కోరుతూ ప్రమాణం చేశారు. పి.సర్వేశ్వరరావు, పట్నాల ప్రసాద్, బాలరాజు, టి.బాబు, సుబ్బారావు, దూదిగం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: నేతాజీ జయంతి వేడుకలు భీమడోలులో ఘనంగా జరిగాయి. భీమడోలు సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ భవానీ రంగ తదితరులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచారు.

పీఆర్ ఇంజనీర్ల సంఘ డైరీ ఆవిష్కరణ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23: ఏపీ పంచాయితీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని మంగళవారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీవోల జేఏసీ ఉమ్మడిజిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ వివరాలు తెలిపారు. పంచాయితీరాజ్ ఎస్ఈ కె.కేదారేశ్వరరావు, ఈఈ ఎం.వి.రమణమూర్తి, సంఘ జిల్లా అధ్యక్షుడు యు.శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి వీరబాబు, పీఆర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్ష ఫీజుకు 30 వరకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 23 : డీఎల్ఎడ్ మూడోసెమిస్టర్(2022-24 బ్యాచ్) పరీక్షలకు ఫీజు రూ.250 చెల్లించడానికి ఈ నెల 30వరకు గడువు ఉంది. రూ.50 అదనపు రుసుముతో ఫిబ్రవరి 2వరకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు చెల్లించవచ్చని డీఈవో శ్యాంసుందర్ మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసేందుకు ఈ నెల 24 నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు.

భవిష్యత్‌కు గ్యారెంటీపై టీడీపీ నేతల ప్రచారం

జంగారెడ్డిగూడెం, జనవరి 23: పట్టణంలోని 43, 56 బూత్‌ల పరిధిలో టీడీపీ నేతలు భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, నాయుడు శ్రీను, గుళ్లపూడి శ్రీదేవి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ ఏర్పాటు

ద్వారకాతిరుమల, జనవరి 23: ఏపీటీఎఫ్ మండల శాఖను మంగళవారం ప్రారంభించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర తెలిపారు. మండల కన్వీనర్‌గా ఎన్.శ్రీనివాసరావు, కోకన్వీనర్‌గా జి.నాగేశ్వర రావు నియమితులయ్యారు.







బుట్టాయగూడెంలో విధుల్లో చేరిన అంగన్వాడీలు, లింగపాలెంలో తెరచుకున్న కేంద్రం, ద్వారకా తిరుమలలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత లింగరాజు

అంగన్వాడీల సమ్మె విజయవంతం

బుట్టాయగూడెం, జనవరి 23: అంగన్వాడీల సమస్యలపై చేపట్టిన సమ్మె విజయవంతమైందని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు కేవీ.రమణ, ఎస్.రామ్మోహన్, టి.రామకృష్ణ, ఎం.నాగమణి తెలిపారు. బుట్టాయగూడెంలో మంగళవారం జరిగిన విజయోత్సవ సమావేశాల్లో వారు మాట్లాడారు. 42 రోజులపాటు ఐక్య పోరాటాలు చేసి విజయం సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఎన్ని కుట్రలు పన్నినా, ఆటంకాలు కల్పించినా బెదరకుండా ప్రభుత్వం దిగొచ్చేలా చేశారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సరుకుల రవాణా చార్జీలు ఇప్పించాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బి.ఆకాశమ్మ, కె.పద్మ, పుష్ప, రామలక్ష్మి, కృపామణి, నూర్జహాన్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయి. ᐟమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో అంగన్వాడీ కేంద్రాలను తెరుస్తున్నట్లు వారు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు తెరుచుకోవడంతో గర్భిణులు, చిన్న పిల్లల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

● కామవరపుకోట: అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో మండలంలోని 59 మంది అంగన్వాడీలు విధులకు హాజరయ్యారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే మరో పోరాటం చేయాల్సి వస్తుందని అంగన్వాడీ సీఐటీయూ నాయకురాలు షేక్ సుభాషిణి, శాంతి తెలిపారు.

● కుక్కునూరు: అంగన్వాడీ కార్యకర్తల సమ్మె విజయవంతమైందని సీఐటీయూ కార్యదర్శి వై.సాయికిరణ్ అన్నారు. అంగన్వాడీలు విధుల్లో చేరుతున్నట్టు సీడీపీవో లక్ష్మీకుమారికి తెలిపారు. వై.నాగేంద్రరావు, కుంజా నాగలక్ష్మి, అన్నపూర్ణ, సుజాత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: అంగన్వాడీల పోరాటపటిమ అమోఘమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. అంగన్వాడీల విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ 42 రోజుల పోరాటంతో రాష్ట్రప్రభుత్వం దిగివచ్చిందన్నారు. కట్టా శ్రీనివాసరావు, బి.దేవానందం మాట్లాడారు.

రాష్ట్ర బంద్ నిలిపివేత

ఏలూరు టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలు సమ్మె విరమించిన నేపథ్యంలో ఈ నెల24న తలపెట్టిన బంద్ నిలిపివేస్తున్నట్లు నేతలు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు రవి, కృష్ణచైతన్య, న్యూడెమోక్రసీ నేత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలు పట్టువదలని పోరాటాన్ని అభినందించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అన్ని డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

జిల్లాలో నలుగురు ఎస్ఐల బదిలీ

ఏలూరు క్రైం, జనవరి 23: జిల్లాలో నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్ కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు టూ టౌన్ ఎస్ఐ కె.శుభాకర్ పెదపాడు బదిలీ అయ్యారు. పెదపాడు ఎస్ఐ చల్లా కృష్ణ ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావును చింతలపూడి, అక్కడ పని చేస్తున్న ఎస్ఐ కె.ప్రసాద్‌ను ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

రేపు వైసీపీ గోపాలపురం నియోజకవర్గ సమావేశం

ద్వారకాతిరుమల, జనవరి 23: హోంమంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఆధ్వర్యంలో గోపాలపురం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 25న ద్వారకాతిరుమలలో జరుగనుంది. తొలుత దేవరపల్లి మండలం యర్నగూడెంలో క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ నుంచి ద్వారకాతిరుమలకు చేరుకుంటారు. కాపు కల్యాణమండపం సమీపంలో వైసీపీ రీజనల్‌కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో పరిచయ కార్యక్రమం, విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** కోటదిబ్బ వద్ద గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. స్వామివారికి తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపారు. నగరంలో ఆంజనేయ స్వామి మందిరాల వద్ద హనుమాన్‌చాలీసా పారాయణ చేశారు.
- **ఏలూరు రూరల్ :** నేతాజీ సుభాష్‌చంద్రబోస్ మహోన్నత వ్యక్తి అని ఆయన అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఆళ్ళనాని అన్నారు. ఫవర్‌పేట బోసుశిబిరం వద్ద మంగళవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమాల సమక్షంలో మెట్టగూడెంలో పలువురు పార్టీలో చేరారు. దొమ్మేటి లక్ష్మీ జనార్ధనరావు, సోము హరినారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- **కొయ్యలగూడెం :** ఈమండలంలోని పరింపూడిలో బైసన్ అనే వ్యక్తి సారా అమ్ముతున్నాడని తమకు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణువర్దన్ తెలిపారు.
- కొయ్యలగూడెం మండలంలో కోడిపందేలపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మూడు కోళ్లు, రెండు కత్తులు, రూ.8200 నగదు, స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.
- **భీమడోలు :** భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బేటీ పడావో బేటీ బచ్చావో కార్యక్రమం నిర్వహించారు. డీసీపీవో సూర్య చక్రవేణి పిల్లల పెంపకంపై తల్లి దండ్రులకు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, నిర్మల పాల్గొన్నారు.
- **నిడమర్రు :** మండలంలో 7 ఉన్నత పాఠశాలలు, 37 ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 280 మంది సిబ్బందికి బ్యాగులు , డైరీలు, క్యాలెండర్లు, సీఎల్.బుక్స్ ఎస్టీయూ జిల్లా అసిసోయేట్ అధ్యక్షుడు కె.వి.యన్.మల్లేశ్వరరావు పంపిణీ చేశారు.
- **ఉంగుటూరు :** లవ్ ఇన్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ, గుడ్ సమరిటన్ ఆసుపత్రి నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్.పాల్ దినకరన్, ఎస్.అబ్నెర్, ఉండ్రాజవరపు భుజంగరావు, ముసలయ్య, కలపాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందించారు. ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. నివేశన స్థలాల సమస్యను ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ సింహాద్రి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ప్రారంభిస్తున్న ముద్దరబోయిన



కైకలూరులో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కామినేని



కలిదిండి, ముదినేపల్లిలో..



రాష్ట్రానికి ఆశాకిరణం లోకేశ్

» పుట్టినరోజు వేడుకల్లో వక్తలు » రక్తదానం, అన్నదానం వంటి పలు సేవా కార్యక్రమాల నిర్వహణ

నూజివీడు, జనవరి 23: టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నూజివీడు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కేక్ కట్‌చేసి మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేసిన లోకేశ్, ఆ శాఖను జాతీయస్థాయిలో అగ్రగామిగా నిలిపార న్నారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లో పక్కారహదారులు, అభివృద్ధి కనిపిస్తోందంటే అది నారాలోకేశ్ చలువే అన్నారు. యువగళం పాదయాత్ర అక్రమార్కుల గుండెల్లో రైళ్ళుపరిగెత్తించిందన్నారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడితీరుతుందని తిరిగి రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, కౌన్సిలర్లు కొమ్మన విజయ, యార్లగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. యనమదలలో లోకేశ్ జన్మదిన వేడుకలను పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరు రాజా, క్లస్టర్ ఇన్‌చార్జ్ యనమదల సత్యనా రాయణ, యనమదల, బత్తులవారిగూడెం, సుంకొల్లు, గ్రామ అధ్యక్షులు చిమటా శ్రీనివాసరావు, జి.పూర్ణచంద్రరావు, ఆరేపల్లి రాంబాబు తదితరులు కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. యనమదల మాజీ సర్పంచ్ పల్లెర్లమూడి రామోజీ, సుంకొల్లు మాజీ సర్పంచ్ దొప్పలపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: సుదీర్ఘ పాదయాత్రతో సమర్థ నేతగా ఎదిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రాష్ట్రానికి ఆశాకిరణం అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్ర రావు అన్నారు. లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా చాట్రాయి టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. మండల నాయకులు పాల్గొన్నారు. చాట్రాయి మెయిన్ సెంటర్‌లోని టీడీపీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తదితర నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

ముసునూరు: లోకేశ్ జన్మదిన వేడుకలను గుడిపాడులో టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి గంగారామ్, మాజీ ఎంపీపీ ఎం.సుబ్బారావు పది కేజీల కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయకులు బోగోలు సత్యనారాయణ, కొల్లి కృష్ణయ్య, పండు, రాంబాబు, వాసు, అనిల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని సార్లు రక్తదానం చేస్తే అన్నిసార్లు ప్రాణదానం చేసినట్టే..

కైకలూరు: రక్తం ఎన్నిసార్లు దానం చేసినా అన్నిసార్లు ప్రాణదానం చేసినట్లేనని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. లోకేశ్ పుట్టినరోజు వేడుకలను కైకలూరులో ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా కైకలూరు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ ఆధ్వర్యంలో గుడివాడ ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని కామినేని ప్రారంభించారు. టీడీపీ మహిళా నాయకురాలు శీలం కృష్ణవేణి ముందుగా రక్త దానం చేశారు. ఈ శిబిరంలో 68 మంది రక్తదానం చేయగా, 456 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి, రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, మాజీ ఎంపీపీ అప్పారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తాడినాడ బాబు, తెలుగు రైతు అధ్యక్షుడు ముళ్లపూడి సత్తిబాబు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, తెంటు వెంకట రమణ, గంగుల శ్రీదేవి, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, శొంఠి రాజేశ్వరి పాల్గొన్నారు. లోకేశ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని కైకలూరులో ఒకరోజు అన్నాక్యాంటీన్‌ను నిర్వహించారు. కైకలూరు కోరుకొల్లు రోడ్డు సెంటర్లో టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వర రాజు ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. టీడీపీ యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో పెద్దమసీదు సెంటర్లో 400 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, యాదవ సాధికార సమితి సభ్యులు తలారి రాజేష్, గంగుల ఏసురాజు, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు వేగిరెడ్డి సురేష్, లక్కింశెట్టి మోహన్, ఎస్సీసెల్ నాయకులు సుధా తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. నియోజకవర్గ యువ నాయకుడు కొడాలి వినోద్ ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పేరుతో పాదయాత్ర చేసిన లోకేష్‌ను అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించారన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తదితర నాయకులు పాల్గొన్నారు. మట్టగుంటలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కోరుకొల్లులో టీడీపీ, జనసేన నేతలు కేక్‌ను కట్ చేశారు.

మండవల్లి: లోకేశ్ జన్మదిన వేడుకలను మండవల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, సుమారు 800 మందికి అన్నదానం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడు కొండలు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పాముల జోసఫ్ తంబి, పళ్ళెం వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కె. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ముదినేపల్లి వై.జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలి

నూజివీడు టౌన్, జనవరి 23: ప్రజావ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూజివీడులో న్యాయవాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజల భూ హక్కులకు భంగం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్ 2022ను తక్షణం రద్దుచేయాలన్నారు. న్యాయవాదులు ఈ చట్టం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

'ప్రజల ఆస్తుల డాక్యుమెంట్లతో ప్రభుత్వానికి పనేంటి'

మండవల్లి, జనవరి 23: రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని ప్రజల ఆస్తుల డాక్యుమెంట్లుతో ప్రభుత్వానికి పనేముందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రశ్నించారు. పెరికేగూడెం, గన్నవరం, కొర్లపాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కష్టపడి సమకూర్చుకున్న ఆస్తుల డాక్యుమెంట్లను ప్రభుత్వం తన దగ్గర ఉంచుకొని ఫోటోస్టాట్‌తో కొనుగోలుదారులను సరిపెట్టుకోవాలంటూ నిబంధనలు విధించడం ఎంతవరకు న్యాయమన్నారు. రైతులు, పేదలు తమ అవసరాలకు తమ ఆస్తులను హామీగా పెట్టి రుణాలు తీసుకుంటారని, ఒరిజినల్ డాక్యుమెంటు లేనప్పుడు భూమికి విలువ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. రైతుల భూముల డాక్యుమెంట్లను ప్రభుత్వం దగ్గర పెట్టుకుని మాయ చేసేందుకు ప్రయత్నం చేస్తుందని, తాకట్లు పెట్టినా ఆశ్చర్యం లేదని కామినేని పేర్కొన్నారు. ఈ దుర్మార్గ పాలన పోవాలంటనే ప్రజలు వైసీపీని తరిమి కొట్టాలన్నారు. టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, కూనపురెడ్డి కోటేశ్వరరావు, పళ్లెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

4 నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దుచేయాలి

ముసునూరు, జనవరి 23: రమణక్కపేట ఫారెస్ట్ భూముల్లో సెక్షన్ 4 నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దుచేసి రెవెన్యూ ఫారెస్ట్ శాఖల జాయింట్ సర్వేను నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అటవీభూముల సాగుదారులతో కలిసి ఆయన రమణక్కపేటలో ఆందోళన నిర్వహించారు. ఈ నెల 26న నూజివీడు అమర్‌భవన్‌లో అఖిలభారత కిసాన్ జిల్లా సదస్సు ఉదయం 11 గంటలకు జరుగుతుందని సాగుదారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పథకాలు వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయండి

నూజివీడు, జనవరి 23: ప్రభుత్వ శాఖల పనితీరు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే దిశగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. ఫిబ్రవరి 3న మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యూ మాడ్యులర్ లీగల్ సర్వీసెస్‌పై సదస్సును నిర్వహిస్తున్న దృష్ట్యా ప్రతి ప్రభుత్వ శాఖ తాము అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్‌గౌడ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ

ముసునూరు, జనవరి 23: రమణక్కపేటలో అట్లూరి చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 170 మంది రోగులకు ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర కళ్ళజోళ్ళను ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్ట్ సేవలు అభినందనీయమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు రంగు ఆంజనేయులు అన్నారు. గ్రామ ప్రముఖులు గోళ్ళ ఆంజనేయులు, వంకదారు విజ్ఞేశ్వరరావు, ట్రస్ట్ సభ్యుడు లక్కపాం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు, కుర్చీల వితరణ

చాట్రాయి, జనవరి 23: మండలంలోని చనుబండ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు చెరుకు శ్రీమన్నారాయణ తనయుడు శ్రీనివాస్ రూ. 15 వేలు విలువైన బెంచీలు, కుర్చీలు అందజేశారు. ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి అనుమానాస్పద మృతి

నూజివీడు టౌన్, జనవరి 23: నూజివీడు పట్టణం మొగల్‌చెరువు ప్రాంతానికి చెందిన పరసా రంజిత్‌కుమార్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం రాత్రి తన ఇంట్లో అచేతనంగా పడి ఉండడంతో బంధువులు అతనిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులు ఫిర్యాదు మేరకు నూజివీడు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్.. సొత్తు స్వాధీనం

ఆగిరిపల్లి, జనవరి 23: చిన్నాగిరిపల్లి గ్రామానికి చెందిన జువ్వనబోయిన రామకృష్ణ వ్యవసాయదారుడు. వ్యవసాయంలో అప్పుల పాలై చివరికి మహిళల మెడల్లో నగలను తస్కరిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతని నుంచి రూ.2.25 లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకుని నూజివీడు కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రుల చెంతకు

ముదినేపల్లి, జనవరి 23: ముదినేపల్లిలో ఈ నెల 19న అదృశ్యమైన విద్యార్థి అబ్దుల్ సల్మాన్ తల్లిదండ్రుల చెంతకు చేరాడు. స్కూలు నుంచి భోజనానికి వచ్చిన సల్మాన్ తిరిగి స్కూల్‌కు వెళ్లకుండా అదృశ్యమైన విషయం విదితమే. సోమవారం రాత్రి 10 గంటలకు ముదినేపల్లిలోని ఒక చోట కూర్చుని ఉన్న సల్మాన్‌ను స్థానికులు గుర్తించి అతని తల్లిదండ్రులకు అప్పగించారు. తాను బందరు వెళ్లానని చెబుతున్నాడే తప్ప ఎందుకు వెళ్లాడో చెప్పటం లేదు.



జనార్ధనవరంలో టీడీపీ జయహో బీసీ సదస్సు



వడాలి సదస్సులో పాల్గొన్న గన్ని వీరాంజనేయులు

టీడీపీతోనే బీసీ రక్షణ చట్టం

చాట్రాయి, జనవరి 23: బీసీ రక్షణ చట్టం సాధించాలంటే తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని బందరు మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, నూజివీడు నియోజకర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జనార్ధనవరంలో మంగళవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. తొలుత వేదికపై లోకేశ్ జన్మదిన కేక్‌ను కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనాభాలో సగ భాగం ఉన్న బీసీలకు జగన్ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. కుల కార్పొరేషన్లుగా విడగొట్టి రాజకీయ నిరుద్యోగులైన తమ పార్టీ నాయకులకు పదవులు పందేరం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి దూరదృష్టి లేకపోవటంతో నిరుద్యోగులు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలస పోవల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ సర్కార్ హయాంలో బీసీలపై దాడులు పెరిగిపోయాయని బీసీ రక్షణ చట్టం వస్తేనే రక్షణ ఉంటుందన్నారు. టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ చలమాల అశోక్ గౌడ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చక్రవర్తి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు తదితరులు మాట్లాడారు. తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు నూతక్కి వేణు గోపాలరావు, ఆరేపల్లి శ్రీను, జనసేన నాయకుడు మరీదు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక : గన్ని

ముదినేపల్లి రూరల్, జనవరి 23: బీసీలకు తెలుగుదేశంపార్టీ హయాంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, టీడీపీకి వారే వెన్నుముక అని గన్ని వీరాంజనేయులు అన్నారు. మంగళవారం ముదినేపల్లి మండలంలోని వడాలి గ్రామంలో మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన జరిగిన బీసీ జయహో సదస్సులో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ మాట్లాడుతూ టీడీపీ అంటే బీసీల పార్టీ అనే విధంగా ముద్రపడిందన్నారు. అనంతరం మండల స్థాయి నాయకులు ప్రసంగించారు. 4 మండలాల నుంచి బీసీలు భారీగా ర్యాలీగా తరలివచ్చారు.

నేడు ముసునూరులో జయహో బీసీ

ముసునూరు, జనవరి 23: ముసునూరులో బుధవారం జయహో బీసీ సభను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవినేని ఢలరామ్, కందుల పిచ్చియ్య తెలిపారు. రైస్‌మిల్లు ప్రాంగణంలో సాయంత్రం 4 గంటల నుంచి సభ జరుగుతుందని మండల వ్యాప్తంగా ఉన్న బీసీలంతా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.



కైకలూరులో కేక్ కట్ చేసి అంగన్వాడీల సంబరాలు

సమ్మె విరమించిన అంగన్వాడీ కార్యకర్తలు

కైకలూరు, జనవరి 23: అంగన్వాడీ కార్యకర్తలు 42 రోజుల సమ్మెను విరమించి మంగళవారం విధుల్లో చేరారు. వారంతా కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. యూనియన్ నాయకుల పిలుపు మేరకు సమ్మెను విరమించినట్లు విధుల్లో చేరినట్లు తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి కే లాజరు, న్యాయవాది రుద్రపాక రత్నాకరరావు, యూనియన్ నాయకులు పి. సుజాత, ఎల్. మీనాకుమారి, ఉషా, రమణ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మె ముగియటంతో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయి. ముదినేపల్లి మండలంలోని 70 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం కాగా, 90 మంది కార్యకర్తలు, 70 మంది సహాయకులు విధుల్లో చేరారు. మండలంలోని అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు అధికారి ఆనంద్ బాబుకు రిపోర్ట్ చేశారు.

కలిదిండి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మంగళవారం విధుల్లోకి చేరటంతో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయి. 42 రోజులుగా సమ్మె చేయటంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. చిన్నారులతో అంగన్‌వాడీ కేంద్రాలు కళకళలాడుతున్నాయి. కలిదిండి మండలంలో మొత్తం 150 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు 149 హెల్పర్లు ఉండగా, అందరూ విధుల్లో చేరారు.

పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం పూర్తిచేయండి

కలిదిండి, జనవరి 23 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం వెంకటాపురంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీపీ ఉమా మహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని అధికారంలోకి తేవాలి : గన్ని

ముదినేపల్లి, జనవరి 23 : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేందుకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, కైకలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెంటే పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం వడాలిలో పార్టీ జయహో బీసీ సదస్సు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా వారు ముదినేపల్లిలోని పార్టీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇంచార్జ్ కొడాలి వినోద్ కార్యాలయం వద్ద మండల నాయకులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఓటర్ల తుది జాబితాలో తొలగింపులు, సవరణలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని పరిశీలించి అవకతవకలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కొడాలి వినోద్‌తోపాటు పార్టీ నాయకులు పరసా ఏడుకొండలు, ఈడే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విమలక్కకు ఘన నివాళి

ముసునూరు, జనవరి 23: ఎన్నో భూ పోరాటాలు చేసిన అబ్బినేని విమలక్క నేటి తరాలకు ఆదర్శమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు అన్నారు. వేల్పుచర్లలో మంగళవారం విమలక్క 15వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి పార్టీజెండాను ఆవిష్కరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, ఇస్లావతు శ్రీరాములు, రాము, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓకు విచారణ నివేదిక

ముదినేపల్లి, జనవరి 23 : పెయ్యేరు పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్టు అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేసినట్లు డీఎల్‌పీవో చంద్రశేఖర్ తెలిపారు. పంచాయతీలో 2018 నుంచి పలు అంశాల్లో అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ నిర్వహించాలని వల్లూరుపల్లి రామకృష్ణ ప్రసాద్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పంచాయతీ అధికారులు ఇటీవల విచారణ జరిపారు. నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలింది. అయితే నివేదికను హైకోర్టుకు అందజేయాల్సి ఉందని డీఎల్‌పీవో తెలిపారు. పంచాయతీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కార్యదర్శిగా వ్యవహరిస్తున్న శ్యామ్ సుందర్‌ను ఆ పంచాయతీ బాధ్యతల నుంచి తప్పించారు. బొమ్మినంపాడు కార్యదర్శి గిరిజకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ తెలిపారు.

సంకల్ప యాత్రలో.. అధికారుల స్పందనేదీ?

నూజివీడు పట్టణ సభకు పలువురు అధికారుల గైర్హాజర్



టిడ్కో గృహాలపై వివరిస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, జనవరి 23: నూజివీడు పట్టణంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు అధికారుల స్పందన కరువైంది. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఖర్చు చేస్తున్న నిధులను వివరిస్తూ మున్సిపల్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టింది. బీజేపీ నాయకుల పర్యవేక్షణలో అధికారులు కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఎవరైనా అర్హత ఉండి లబ్ధి పొందలేని వారిని గుర్తించి వారికి పథకాలను అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నాలుగు శాఖలు మినహా మిగిలిన శాఖలు గైర్హాజరయ్యాయి. మెప్మా, హౌసింగ్, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీనిపై బీజేపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా, నూజివీడు మున్సిపల్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం ద్వారా 3,348 నివేశనా గృహాలను మంజూరు చేయగా, కేవలం 1251 నివాసగృహాలు మాత్రమే గ్రౌండ్ అయ్యాయని, గృహ నిర్మాణశాఖ అధికారులు తెలిపారు. అదేవిధంగా నూజివీడు మున్సిపల్‌పరిధిలో అర్బన్‌హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాన్ని రూ.1.60 కోట్లతో చేపట్టడం జరిగిందన్నారు. పీఎమ్ఏవై, వైఎస్సార్ కాలనీ పథకాల కింద నిర్మాణమైన టిడ్కో భవనాలకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.26 కోట్లు నిధులను ఖర్చు చేయగా, ఇప్పటికీ అవి అసంపూర్తిగా నిలిచిపోవడం, ఐదేళ్లు పూర్తయినా లబ్ధిదారులకు నివేశనా గృహాలు ఇవ్వకపోవడంపై సంకల్ప యాత్రలో హౌసింగ్ అధికారులపై లబ్ధిదారులు ధ్వజమెత్తారు. నూజివీడు మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, జిల్లా కార్యదర్శి వసుంధరా దేవి, నాయకులు మాగంటి వాసు, వైఎస్ దొర్రై, బోను అప్పారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి మండలంలో సంకల్ప యాత్ర

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి, తోటపల్లి, కనసానపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. అసిస్టెంట్ ఇన్‌చార్జ్ ఇంజినీర్ అర్జున్ మాట్లాడుతూ జల జీవన్ పథకం కింద ఆగిరిపల్లిలో రూ. 1.30 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలన్నారు. అగ్రికల్చర్ ఏఈవో ధనబాబు మాట్లాడుతూ రూ. 6 లక్షల నుంచి రూ.10లక్షల విలువ చేసే డ్రోన్లను కేంద్రం 40 శాతం సబ్సిడీపై ఇస్తుందని ఐదు గ్రూప్‌లు కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉజ్వల గ్యాస్ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే సిలిండర్‌పై రూ. 300 సబ్సిడీ ఉంటుందని గ్యాస్ కంపెనీ అధినేత పాలడుగు శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు, రంగారావు, ఆగిరిపల్లి సర్పంచ్ లక్ష్మి, హోమియో డాక్టర్ డి.రజిత పాల్గొన్నారు.

మహిళలదే పైచేయి

నూజివీడు టౌన్, జనవరి 23: నూజివీడు నియోజకవర్గంలో ఓటర్లు 3,944 మంది పెరిగారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,37,139 కాగా అందులో పురుషులు 1,17,398, మహిళలు 1,19,730గా ఉంది. ట్రాన్ జెండర్లు 11 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చూస్తే పురుషులకన్నా 2,332 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నూజివీడు నియోజకవర్గం ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నూజివీడు	28,083	28,519	1	56603
నూజివీడు మండలం	20,236	22,020	6	42,262
ముసునూరు	22,743	22,557	3	45,303
చాట్రాయి	21,550	21,471	1	43,022
ఆగిరిపల్లి	24,786	25,163	-	49,949
మొత్తం	**1,17,398**	**1,19,730**	**11**	**2,37,139**

కైకలూరు నియోజకవర్గంలోనూ వారే ముందు..

కైకలూరు, జనవరి 23: కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్లలో మొత్తం 2,04,348 ఓటర్లుండగా కొత్తగా 8566 ఓటర్లు నమోదైనట్లు తహసీల్దార్ బి. మురళీకృష్ణ తెలిపారు. వీటిలో మహిళలే 2981 ఓట్లు అత్యధికంగా ఉన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కైకలూరు అత్యధికంగా 59,732 ఓట్లు కాగా కలిదిండి 56,479 ఓట్లు ఉన్నాయి. ముదినేపల్లి 49,082 ఓట్లు కాగా మండవల్లి 39,055 ఓట్లు ఉన్నాయి. ప్రతి మండలంలోనూ పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఉన్నారు.

కైకలూరు నియోజకవర్గం ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కైకలూరు	29335	30394	3	59732
కలిదిండి	27948	28531	0	56479
మండవల్లి	19224	19831	0	39055
ముదినేపల్లి	24173	24905	4	49082
మొత్తం ఓటర్లు	**1,00,680**	**1,03,661**	**7**	**2,04,348**

10 రోజుల ముందు వరకు ఓటర్ల నమోదు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు, జనవరి 23: ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ దాఖలుకు పదిరోజుల ముందు వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, నూజి వీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాల యంలో వివిధ రాజకీయ పక్షాలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడు తూ ఒకే ఐడీ నుంచి ఫాం-7లను ఆన్‌లైన్‌లో నమోదుచేసిన వారిని గుర్తించటం జరిగిందని, వాస్తవంగా ఉన్న ఓటర్లను లేనట్లుగా చూపి ఓట్ల తొలగింపుకు ప్రయత్నించిన సదరు వ్యక్తుల పై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు బోను అప్పారావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో నలుగురు ఎస్‌ఐల బదిలీ

ఏలూరు క్రైం, జనవరి 23: జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్ కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు టూ టౌన్ ఎస్‌ఐ కె.శుభాకర్ పెదపాడు బదిలీ అ య్యారు. పెదపాడు ఎస్‌ఐ చల్లా కృష్ణ ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశా రు. ముసునూరు ఎస్‌ఐ ఎం.కుటుంబరావును చింతలపూడి, అక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ కె.ప్రసాద్‌ను ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

ఆసరా నిధులు మంజూరు

ముదినేపల్లి, జనవరి 23 : ముదినేపల్లి మండలంలోని 1170 స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రూ.11.75 కోట్లు మంజూరైనట్లు వెలుగు ఏపీఎం టి.సత్యనారాయణ తెలిపారు. వారోత్సవాల్లో ఈ సొమ్మును లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాల రికార్డులను నిశితంగా పరిశీలించాలని బుక్ కీపర్లకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

సురక్షలో 291 మందికి వైద్య సేవలు

చాట్రాయి, జనవరి 23: మండలంలోని చనుబండ-2 సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఫేజ్-2 సురక్ష వైద్య శిబిరంలో 291 మందికి వైద్య సేవలు అందించారు. ఏలూరు జీజీహెచ్ వైద్య నిపుణులు ఇ. శ్వేత (పీడియాట్రిక్), సుప్రియా చౌదరి (జనరల్ మెడిసిన్), పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులరెడ్డి, దుర్గా ప్రసాద్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు సర్పంచ్ వి. జ్యోతి, ఎంపీటీసీలు చింతగుంట్ల వెంకటేశ్వరరావు, సోనీ ఆనంద్, నాయకులు వాసు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు 11 టీంలు

ముదినేపల్లి, జనవరి 23 : ఆడుదాం - ఆంధ్రా కైకలూరు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు ముదినేపల్లి మండలం నుంచి ఐదు విభాగాల్లో 11 టీములు ఎంపికైనట్లు ఎంపీడీవో పి.మల్లేశ్వరి తెలిపారు. వాలీబాల్ పోటీలకు గురజ, కోడూరు టీములు, క్రికెట్ పోటీలకు గురజ, సింగరాయపాలెం, ఖో-ఖో పోటీలకు బొమ్మినంపాడు, కబడ్డీ పోటీలకు చిగురుకోట, పెదగొన్నూరు, గురజ టీములు, బ్యాడ్మింటన్ పోటీలకు పెయ్యేరు, పెదగొన్నూరు టీములు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

ముసునూరు, జనవరి 23: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్ అన్నారు. మంగళవారం చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవానీ వెంకట్రావు, సర్పంచ్ రాధికాసత్యనారాయణ, ఎంపీటీసీ పుష్పావతి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చిలుకూరి పద్మజా దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.